

## టీడీపీ జిల్లా కమిటీల ఏర్పాటు

**అరసవల్లి, మార్చి 14:** సాధారణ ఎన్నికల పర్యవేక్షణ కోసం గురువారం శ్రీకాకుళం టీడీపీ కార్యాలయంలో పార్టీ జిల్లా కమిటీలు ఏర్పాటు చేశారు. ● అడ్మినిస్ట్రేటివ్ కమిటీలో కొమనాపల్లి వెంకటరామరాజు, బొనిగి భాస్కరరావు, తూతిక జోగారావు ● పొలిటికల్ కమిటీలో సింతు సుధాకర్, చిట్టి మోహనరావు ● మీడియా మేనేజ్‌మెంట్ కమిటీలో ప్రధాన విజయరాం, గుత్తు చిన్నారావు, అరవింద్ మహదేవ్ ● లీగల్‌సెల్‌లో గోర అనిల్‌కుమార్, బగాది రామ్మోహనరావు, ఎం.సింహాద్రినాయుడు, కె.అమ్మినాయుడు, ఎస్.హరి సభ్యులుగా ఉంటారని.. సమన్వయంతో విధులు నిర్వర్తిస్తారని టీడీపీ జిల్లా అధ్యక్షుడు కూన రవికుమార్ తెలిపారు.





బగ్గు రమణమూర్తి

# ఆ నాలుగింటిపై ఉత్కంఠ

- రెండో జాబితాలో నరసన్నపేటకు రమణమూర్తి ఖరారు
- శ్రీకాకుళం, ఎచ్చెర్ల, పలాస, పాతపట్నంపై తేల్చనివైనం
- ఆశావహుల్లో టెన్షన్.. తమకే సీటు వస్తుందని ధీమా

(ఆంధ్రజ్యోతి-శ్రీకాకుళం)

టీడీపీ శ్రేణుల్లో ఉత్కంఠ నెలకొంది. సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో ఇటీవల పార్టీ అధినేత తొలిజాబితా ప్రకటించా రు. శ్రీకాకుళం ఎంపీ అభ్యర్థితోపాటు ఆమదాలవలస, టెక్కలి, ఇచ్ఛాపురం అసెంబ్లీ నియోజకవర్గాల అభ్యర్థులను ఖరారు చేశారు. మిగిలిన నియోజకవర్గాల్లో ఆశావహులంతా రెండో జాబితా కోసం ఎదురుచూశారు. కాగా.. గురువారం చంద్రబాబునాయుడు రెండో జాబితా ప్రకటించగా.. అందులో కేవలం నరసన్నపేట నియోజకవర్గ అభ్యర్థిగా మాజీ ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తిని ఖరారు చేశారు. శ్రీకాకుళం, ఎచ్చెర్ల, పలాస, పాతపట్నం నియోజకవర్గాల అభ్యర్థులను ప్రకటించలేదు. ఆయా నియోజకవర్గాల్లో 'ఆ నలుగురు' అభ్యర్థులు ఎవరన్నది చర్చనీయాంశమవుతోంది. తమకు టికెట్ దక్కుతుందో లేదోనని ఆశావహుల్లో టెన్షన్ నెలకొంది.

● నరసన్నపేటలో టీడీపీ టికెట్ కోసం నియోజకవర్గ ఇన్‌చార్జి బగ్గు రమణమూర్తితోపాటు శ్రీకాకుళంలో వైద్యవృత్తి చేస్తున్న బగ్గు శ్రీనివాసరావు ఆశించారు. అధిష్ఠానం సర్వే చేయగా పార్టీ శ్రేణులతోపాటు ప్రజలు కూడా రమణమూర్తి వైపే మొగ్గు చూపారు. దీంతో అధిష్ఠానం రమణమూర్తిని అభ్యర్థిగా ఖరారు చేసింది. 2014 ఎన్నికల్లో ఎమ్మెల్యేగా బగ్గు రమణమూర్తి గెలు పొందారు. 2019లో ఓటమి చెందారు. తాజాగా మూడోసారి బరిలో దిగనున్నారు.

● శ్రీకాకుళంలో టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి గుండ లక్ష్మీదేవి.. 2014లో ఎమ్మెల్యేగా గెలుపొందారు. అంతకుముందు వరకు ఈ నియోజకవర్గానికి మాజీమంత్రి గుండ అప్పలసూర్యనారాయణ ప్రాతినిధ్యం వహించేవారు. ఆ కుటుంబానికే టీడీపీ ప్రాధాన్యం ఇచ్చేది. ఈసారి ఈ నియోజకవర్గం నుంచి జిల్లా సర్పంచ్‌ల సంఘం అధ్యక్షుడు గొండు శంకర్ టీడీపీ తరఫున టికెట్ ఆశించారు. అధిష్ఠానం ఐవీఆర్ఎస్ ద్వారా.. అలాగే వేర్వేరుగా సర్వేలు చేసింది. ఈలోగా టీడీపీ, జనసేన, బీజేపీ పొత్తు కుదిరింది. ఈ నేపథ్యంలో శ్రీకాకుళం నియోజకవర్గంలో పోటీ చేసేందుకు బీజేపీ ఆశిస్తుందని వార్తలు వెలువడ్డాయి. దీంతో ఇక్కడ అభ్యర్థిని ప్రకటించలేదు.

● పాతపట్నంలో మాజీఎమ్మెల్యే, నియోజకవర్గ ఇన్‌చార్జి కలమట వెంకటరమణ, పలాస నియోజకవర్గంలో టీడీపీ రాష్ట్ర ప్రధానకార్య దర్శి గౌతు శిరీష తమ అభ్యర్థిత్వాలను రెండో జాబితాలో వెల్లడవుతాయని ఎదురుచూశా రు కానీ.. వారు పేర్లు వెల్లడికాలేదు. పలాసలో టీడీపీకి దాదాపు లైన్‌క్లియర్‌గా ఉన్నప్పటికీ.. ఇటీవలే జనసేనలో చేరిన డా. దానేటి శ్రీధర్ పలాస అభ్యర్థిగా జనసేన నుంచి సీటు ఆశిస్తున్నారు. పాతపట్నంలో వంశధార నిర్వాసితులు.. అక్కడ వైసీపీలో అసంతృప్తి.. టీడీపీ అభ్యర్థి గెలుపు సునాయాసంగా ఉండేలా పరిస్థితి ఏర్పడింది. కాగా.. పెండింగ్‌లో ఉన్న నాలుగు నియోజవర్గాల్లో ఆశావహులంతా మూడో జాబితా కోసం ఆశగా ఎదురుచూస్తున్నారు.

● ఎచ్చెర్ల నియోజకవర్గంలో టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు, మాజీ మంత్రి కిమిడి కళావెంకటరావు రేసులో ఉన్నారు. అయితే ఆయనను చీపురుపల్లిలో మంత్రి బొత్స సత్యనారాయణపై పోటీగా దించాలని అధి ష్ఠానం ఆలోచిస్తోంది. అలాగే విజయనగరం పార్లమెంట్ స్థానానికి బరిలో దించాలన్న తర్జనభర్జనలో ఉంది. ఈనేపథ్యంలో ఎచ్చెర్ల టికెట్ విషయంలో అభ్యర్థిని ప్రకటించలేదు. ఇదిలా ఉండగా.. ఈ నియోజకవర్గం నుంచి పొందూరు మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ కలిశెట్టి అప్పలనాయుడు టికెట్ ఆశిస్తున్నారు.

## నరసన్నపేట.. రమణమూర్తికే

● టీడీపీ శ్రేణుల్లో సంబరాలు

**నరసన్న పేట, మార్చి 14:** రానున్న అసెంబ్లీ ఎన్నికల్లో నరసన్నపేట టీడీపీ అభ్యర్థిగా మాజీ ఎమ్మెల్యే, నియోజకవర్గ ఇన్‌చార్జి బగ్గు రమణమూర్తిని పార్టీ అధినేత చంద్రబాబునాయుడు ప్రకటించారు. టికెట్ కోసం బగ్గు రమణమూర్తితో పాటు మాజీ ఎమ్మెల్యే బగ్గు లక్ష్మణరావు కుమారుడు.. డాక్టర్ బగ్గు శ్రీనివాసరావు ఆశించారు. చివరకు అధిష్ఠానం బగ్గు రమణమూర్తికి టికెట్ ఖరా రు చేయడంతో ఉత్కంఠకు తెరపడింది. బగ్గు రమణమూర్తి నిత్యం ప్రజలతో సత్సంబంధాలు కొనసాగించడం, ప్రజా సమస్యలపై పోరాడడం, నేతలను, కార్య కర్తలను సమన్వయం చేసుకుంటూ పార్టీని బలోపేతం చేయడంతో.. అధిష్ఠానం ఆయన సేవలను గుర్తించి టికెట్ ఖరారు చేసిందని అనుచరులు చెబుతున్నారు. గురువారం కార్యాలయంలో బగ్గు రమణమూర్తిని నాయకులు, కార్య కర్తలు కలిసి స్వీట్లు తినిపించారు. బాణసంచా కాల్చి సంబరాలు చేసుకున్నారు. మబుగాం నుంచి ద్విచక్ర వాహనాలతో ర్యాలీగా నరసన్నపేట చేరుకున్నారు. ఎన్టీఆర్, కేంద్రమాజీ మంత్రి ఎర్రన్నాయుడు విగ్రహాలకు పూలమాలలతో నివాళి అర్పించారు. నరసన్న పేటలో ద్విచక్ర వాహనాలతో ర్యాలీ చేశారు.

● **గెలుపే లక్ష్యంగా పనిచేయాలి**

ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా పనిచేయాలని పార్టీ శ్రేణులకు టీడీపీ అభ్యర్థి బగ్గు రమణమూర్తి పిలుపునిచ్చారు. గురువారం పైడితల్లి ఆలయం నుంచి పట్టణంలో ర్యాలీగా పార్టీ కార్యాలయం వద్దకు చేరుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జనసేన-బీజేపీ నాయకులను కలుపుకొంటూ గ్రామాల్లో ఇంటింటా చంద్రన్న ప్రవేశపెట్టనున్న పథకాలను ప్రచారం చేయాలన్నారు. రామరాజ్యం వచ్చేందుకు ప్రతీ ఒక్క కార్యకర్త హనుమంతుడు వలె పనిచేయాలని, అధికార పార్టీల ఆగడాలపై డేగ కన్ను వేయాలని సూచించారు. తనపై నమ్మకంతో మరోసారి టికెట్ కేటాయించిన అధినేత చంద్రబాబుతో పాటు టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు కింజరాపు అచ్చెన్నాయుడు, పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్‌కు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో నాలుగు మండలాల నుంచి పెద్దఎత్తున కార్యకర్తలు పాల్గొన్నారు.

## ఎమ్మెల్యే ఎన్నికల ప్రచారం

● **సోంపేట:** మండలంలోని గొల్లగండిలో ఎమ్మెల్యే బెందాళం అశోక్ ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంటింటికి వెళ్లి రానున్న ఎన్నికల్లో టీడీపీని గెలిపిస్తే మహిళలకు మరింత మెరుగ్గా సంక్షేమ పథకాలు అందుతాయని వివరించారు. కార్యక్రమంలో నాయకులు నిట్టగోపాల్, బడే తమ్మారావు పాల్గొన్నారు.



ఎమ్మెల్యే అశోక్‌కు తిలకం దిద్దుతున్న మహిళ

## పార్లమెంట్ రిటర్నింగ్ అధికారిగా కలెక్టర్

● అసెంబ్లీ ఏఆర్వోలుగా డిప్యూటీ కలెక్టర్లు



(ఆంధ్రజ్యోతి-శ్రీకాకుళం)

మరికొన్ని రోజుల్లో ఎన్నికల కోడ్ రానుంది. సార్వత్రిక ఎన్నికల నిర్వహణకు ప్రకటన వెలువడనుంది. ఈ నేపథ్యంలో ముందస్తు ఏర్పాట్లు పూర్తవుతున్నాయి. శ్రీకాకుళం పార్లమెంట్ నియోజకవర్గ ఎన్నికల రిటర్నింగ్ అధికారిగా కలెక్టర్ డా. మన్‌జీర్ జిలానీ సమూన్ (ఫోన్‌నెంబర్: **98499 03786**) వ్యవహరించనున్నారు. అలాగే అసెంబ్లీ నియోజకవర్గాలకు జాయింట్ కలెక్టర్‌ను, డిప్యూటీ కలెక్టర్‌లు, ఆర్డీవోలను ఏఆర్వోలుగా నియమించారు. నియోజకవర్గాలకు సంబంధించి అదనంగా ఏఆర్వోలుగా జిల్లా రెవెన్యూ అధికారి ఎం.గణపతిరావు (**94906 12829**), జిల్లాపరిషత్ సీఈఓ కూడా వ్యవహరిస్తారు. ఈ మేరకు గురువారం ఉత్తర్వులు జారీఅయ్యాయి. ఎన్నికల ప్రక్రియ మొత్తం వీరి ఆధ్వర్యంలో జరుగుతుంది.

| నియోజకవర్గం | ఏఆర్వో | ఫోన్ నెంబర్ |
|---|---|---|
| ఇచ్ఛాపురం | బి.సుదర్శనదొర, కేఆర్ఆర్‌సీ డిప్యూటీ కలెక్టర్ | 8008397916 |
| పలాస | డా బి.భరత్‌నాయక్, ఆర్డీవో | 8333989275 |
| టెక్కలి | నూరుల్‌కమర్, సబ్‌కలెక్టర్ | 8333988802 |
| పాతపట్నం | ఎం.అప్పారావు, డిప్యూటీ కలెక్టర్(ఎఫ్ఎస్ఓ) | 9398764880 |
| శ్రీకాకుళం | సీహెచ్ రంగయ్య, ఆర్డీవో | 9573356699 |
| ఆమదాలవలస | ఎం.నవీన్, జాయింట్ కలెక్టర్ | 8143193111 |
| నరసన్నపేట | జేవీవీఎస్ రామ్మోహన్‌రావు, డిప్యూటీ కలెక్టర్ | 9440422302 |
| ఎచ్చెర్ల | ఎస్‌వీ లక్ష్మణమూర్తి, డిప్యూటీ కలెక్టర్ | 9121251111 |

## అమ్మా.. క్షమించు

● విశాఖలో బీటెక్ విద్యార్థి ఆత్మహత్య ● నరసన్నపేటలో విషాదఛాయలు



జశ్వంత్ (ఫైల్)

**నరసన్న పేట/ కొమ్మాది, మార్చి 14:** నరసన్నపేటలోని ప్రశాంత్ నగర్‌కు చెందిన జశ్వంత్(18) విశాఖపట్నంలో ఒక ప్రైవేటు హాస్టల్‌లో బుధవారం రాత్రి ఆత్మహత్య చేసుకున్నాడు. పీఎం పాలెం సీఐ వై. రామకృష్ణ తెలిపిన వివరాలు ప్రకారం.. నరసన్నపేటకు చెందిన బజాజ్ రమేష్ కుమారుడు జశ్వంత్ విశాఖలోని గీతం యూనివర్సిటీలో బీటెక్ ఈసీఈ మొదటి సంవత్సరం చదువుతున్నాడు. రుషికొండలోని స్నేహితుడితో కలిసి ఒక ప్రైవేటు హాస్టల్‌లో ఉంటున్నాడు. బుధవారం తల్లి సంధ్య ఫోన్‌కు.. తన ఐ ఫోన్ పాస్‌వర్డ్, నోట్‌బుక్ పాస్‌వర్డ్‌ను మేసేజ్ చేశాడు. అనంతరం 'అమ్మా... స్సారీ' అంటూ మరో మేసేజ్ పంపించాడు. ఏమైందోనని కంగారు పడుతూ తల్లి సంధ్య జస్వంత్‌కు ఫోన్ చేయగా.. లిఫ్ట్ చేయలేదు. దీంతో అనుమానంతో జశ్వంత్ స్నేహితులకు ఆమె ఫోన్ చేశారు. అప్పటికే హాస్టల్‌లో జశ్వంత్ ఉరి వేసుకుని చనిపోయాడని వారు తెలిపారు. ఒక్కగానొక్క కుమారుడు బలవన్మరణానికి పాల్పడడంతో రమేష్, సంధ్యలు కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు. ఎందుకు ఆత్మహత్య చేసుకున్నాడో తెలియడం లేదని రోదిస్తున్నారు.

**ఏమైందో..**

బుధవారం సాయంత్రం ఏడు గంటల సమయంలో హాస్టల్ వార్డెన్.. విద్యార్థి తండ్రి రమేష్‌కి ఫోన్ చేసి జశ్వంత్‌కు ఫిట్స్ రావడంతో ఆసుపత్రికి తీసుకువెళుతున్నామని చెప్పారు. దీంతో విద్యార్థి తల్లిదండ్రులు ఆసుపత్రికి చేరుకునేసరికి జశ్వంత్ మృతి చెందినట్టు వైద్యులు తెలిపారు. మృతుడి తల్లిదండ్రులు అసలు ఏమి జరిగిందని ఆరా తీశారు. జశ్వంత్ బుధవారం సాయంత్రం 4.30గంటలకు గదిలోకి వెళ్లాడు. అతని స్నేహితులు రాత్రి ఏడు గంటల సమయంలో గదికి వచ్చారు. డోర్ లోపల లాక్ చేసి ఉండడంతో మరో తాళంతో తలుపు తెరిచి చూసేసరికి జశ్వంత్ బెడ్ షీట్‌తో ఫ్యాన్‌కు ఉరి వేసుకుని కనిపించాడు. వెంటనే వారు ఆస్పత్రికి తరలించారు. అప్పటికే అతను మృతి చెందినట్టు వైద్యులు నిర్ధారించారు. మృతుడి తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని సీఐ రామకృష్ణ తెలిపారు. కాగా విద్యార్థి ఆత్మహత్యకు గల కారణాలు తెలియరాలేదు.

## పుట్టెడు దుఃఖంలోనూ పరీక్షకు

● తండ్రి మృతి చెందినా హాజరైన జయలక్ష్మి



శ్రీకాకుళంలో పరీక్ష కేంద్రం వద్ద జయలక్ష్మి

**నరసన్న పేట, మార్చి 14:** తండ్రి రోడ్డు ప్రమాదంలో మృతి చెందగా.. తన చదువు వృథా కాకూడదని పుట్టెడు దుఃఖంలోనూ ఇంటర్ పరీక్ష రాసింది ఓ విద్యార్థిని. నరసన్నపేట మండలం కిళ్లాం గ్రామానికి చెందిన లారీ డ్రైవర్ గొలివి ఆదినారాయణ.. మంగళవారం అర్ధరాత్రి ఒడిశాలోని రోడ్డు ప్రమాదంలో మృతి చెందారు. గురువారం ఉదయం ఆయన మృతదేహాన్ని స్వగ్రామానికి తీసుకువచ్చారు. ఆదినారాయణ కుమార్తె జయలక్ష్మి శ్రీకాకుళంలోని ఒక ప్రైవేటు కళాశాలలో ఇంటర్మీడియట్ ప్రథమ సంవత్సరం చదువుతోంది. గురువారం ఇంటర్ చివరి పరీక్ష కావడంతో... పుట్టెడు దుఃఖంలోనూ శ్రీకాకుళంలో కేంద్రానికి ఆ విద్యార్థిని చేరుకుంది. మరో గంటలో తన తండ్రి మృతదేహం వస్తుందని తెలిసినా.. కన్నీటి పర్యంతమవుతూ నిర్ణీత సమయానికి పరీక్షకు హాజరైంది. దుఃఖాన్ని దిగమింగుకుని పరీక్షలు రాసింది. ఆమె పరీక్ష రాసి వచ్చిన తర్వాత కుటుంబ సభ్యులు ఆదినారాయణకు దహన సంస్కారాలు పూర్తిచేశారు.

## టెక్కలిలో వైసీపీ తాయిలాలు

● ప్రజాప్రతినిధులకు, వలంటీర్లకు డబ్బుల పంపిణీ

**టెక్కలి, మార్చి 14:** ఎన్నికలు సమీపిస్తున్న వేళ టెక్కలి నియోజకవర్గంలోని అధికార పార్టీ తాయిలాల పంపిణీలో ముందువరుసలో ఉంది. ఇప్పటికే పాతపట్నంలో కొందరు వైసీపీ నాయకులు తాయిలాలు పంపిణీ చేశారు. ఇదే అదునుగా టెక్కలిలో కూడా బుధవారం రాత్రి నుంచి కొంతమంది వైసీపీ నాయకులు.. ప్రజాప్రతినిధులకు, వలంటీర్లకు డబ్బుల ఎర చూపుతున్నారు. ఇటీవల మహిళా దినోత్సవం రోజు మహిళలకు చీరలు పంపిణీ చేసిన విషయం తెలిసిందే. అలాగే టెక్కలి నియోజకవర్గ పరిధిలో ప్రింట్ అండ్ ఎలక్ట్రానిక్ మీడియా విలేకరులకు ఒక డ్రస్సు, చీర పంపిణీ చేశారు. తాజాగా ఎంపీటీసీకి రూ.లక్ష, సర్పంచ్‌కు రూ.50వేలు, వలంటీరుకు రూ.10వేలు చొప్పున పంపిణీకి శ్రీకారం చుట్టారు. అధికారపార్టీలో వ్యతిరేకత ఉన్న ప్రాంతాల్లో నాయకులకు అదనపు తాయిలాలు అందజేశారు. మరోవైపు ఇటీవల నిర్వహించిన చేయూత, ఆసరా కార్యక్రమాల్లో కూడా వెలుగు సీఎఫ్‌ల ద్వారా పెద్దఎత్తున మహిళలను రప్పించి అధికార పార్టీ కార్యకర్తల సమావేశంలా మార్చారనే ఆరోపణలున్నాయి. అలాగే పంచాయతీలు వారీగా వాలంటీర్లతో సమావేశాలు ఏర్పరచి 'అంతా మీదే బాధ్యత' అన్నట్టుగా వారిపై ఒత్తిడి చేస్తున్నారనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

## వలంటీర్లపై ఎన్నికల కమిషన్‌కు ఫిర్యాదు

**మెళియాపుట్టి, మార్చి 14:** వైసీపీ ఎన్నికల ప్రచారంలో పాల్గొన్న వలంటీర్లపై ఎన్నికల కమిషన్‌కు ఫిర్యాదు చేశామని పాతపట్నం నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి, మాజీ ఎమ్మెల్యే కలమట వెంకటరమణ తెలిపారు. మెళియాపుట్టిలో బుధవారం ఎమ్మెల్యే రెడ్డిశాంతి కూమారుడు ఓంశ్రీకృష్ణ ఎన్నికల ప్రచారం నిర్వహించగా.. అధికంగా వలంటీర్లు పాల్గొనడం చర్చనీయాంశమైంది. దీనిపై గురువారం 'ఆంధ్రజ్యోతి'లో కథనం వెలువడిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో గ్రామ వలంటీర్ల పేర్ల వివరాలతో కొన్ని వీడియోలు ఎన్నికల కమిషన్‌కు పంపించామని కలమట తెలిపారు. వైసీపీ నాయకులను ప్రజలు నమ్మరని తెలుసుకుని.. వలంటీర్లను ఉపయోగిస్తున్నారని పేర్కొన్నారు. నోట్లు ద్వారా ఓట్ల రాజకీయానికి తెరతీస్తున్నారని ఆరోపించారు.

## ఇంటి బిల్లుకు లంచం

● రూ.5వేలు డిమాండ్ చేసిన సచివాలయ ఉద్యోగి
● ఏసీబీకి పట్టుబడిన ఇంజనీరింగ్ అసిస్టెంట్



ఏసీబీకి పట్టుబడిన సాబకోట ఇంజనీరింగ్ అసిస్టెంట్ లోకనాథం

**హరిపురం, మార్చి 14:** మందస మండలం సాబకోట సచివాలయ ఇంజనీరింగ్ అసిస్టెంట్ ఎస్.లోకనాథం లంచం తీసుకుంటూ ఏసీబీ అధికారులకు పట్టుబడ్డారు. ఇందుకు సంబంధించి ఏసీబీ డీఎస్పీ బీవీ రమణమూర్తి తెలిపిన వివరాలిలా ఉన్నాయి.

సాబకోట పంచాయతీ పరిధిలో గిరిజనులు కాళ్లరిగేలా తిరుగుతున్నా కాలనీ ఇళ్ల బిల్లులు కావటంలేదు. ఇంజనీరింగ్ అసిస్టెంట్ లోకనాథం.. సాబకోటకు పక్కనే ఉన్న చీపి పంచాయతీ లొడకపిట్ట గ్రామస్థుడు. దీంతో లంచం ముట్టజెప్పినవారికి ఇల్లు కట్టకపోయినా బిల్లులు మంజూరు చేస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. దీనిపై గిరిజనులు ఏసీబీ అధికారులను ఆశ్రయించి ఫిర్యాదు చేశారు. రెడ్‌హ్యాండెడ్‌గా ఆయన లంచావతారాన్ని బయటపెట్టేందుకు ఓ గిరిజన బాధితుడు నిమ్మాన పరశురాంతో కలిసి ఏసీబీ అధికారులు పథకం పన్నారు. ఈ క్రమంలో నిమ్మాన పరశురాం బిల్లుల చెల్లింపు కోసం ఫోన్‌లో ఇంజనీరింగ్ అసిస్టెంట్ లోకనాథాన్ని సంప్రదించాడు. ముందుగా రూ.5వేలు మామూళ్లు ఇవ్వాలని లోకనాథం డిమాండ్ చేశాడు. ఎన్నికల కోడ్ వస్తే.. బిల్లులు మంజూరు కావని.. మధ్యాహ్నం సమయంలో ఆ డబ్బులు సచివాలయానికి తీసుకురావాలని స్పష్టం చేశాడు. ఈ మేరకు గురువారం మధ్యాహ్నం ఇంజనీరింగ్ అసిస్టెంట్ లోకనాథానికి పరశురాం రూ.5వేలు అందజేశారు. ఆ సమయంలో అక్కడే మాటు వేసిన ఏసీబీ అధికారులు రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. లోకనాథాన్ని అదుపులోకి తీసుకుని విశాఖపట్నం ఏసీబీ కోర్టుకు తరలించామని ఏసీబీ డీఎస్పీ రమణమూర్తి తెలిపారు.

## లోక్ అదాలత్‌లో కేసులు రాజీ చేసుకోండి

● జిల్లా న్యాయాధికారి జేఏ మౌలానా



మాట్లాడుతున్న జిల్లా న్యాయాధికారి జేఏ మౌలానా

**గుజరాతీపేట, మార్చి 14:** జిల్లాలో ఈ నెల 16న నిర్వహించనున్న జాతీయ లోక్‌అదాలత్‌ను ప్రజలు సద్వినియోగించుకుని.. ఎక్కువ కేసులు రాజీ చేసుకోవాలని జిల్లా ప్రధాన న్యాయాధికారి జునైద్ అహ్మద్ మౌలానా తెలిపారు. 'శ్రీకాకుళం, ఆమదాలవలస, పాలకొండ, పాతపట్నం, కోటబొమ్మాళి, నరసన్నపేట, పలాస, రాజాం, సోంపేట, టెక్కలి, కొత్తూరు, పొందూరు, ఇచ్ఛాపురం కోర్టుల్లో జాతీయ లోక్ అదాలత్ నిర్వహిస్తాం. సివిల్, రాజీపడ్డ క్రిమినల్ కేసులతోపాటు ప్రీ లిటిగేషన్ స్థాయిలో ఉన్న కేసులు కూడా రాజీ చేస్తాం. లోక్ అదాలత్ ద్వారా కక్షిదారులకు సమయం, డబ్బు ఆదా అవుతాయి' అని న్యాయాధికారి జేఏ మౌలానా స్పష్టం చేశారు. కార్యక్రమంలో జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి ఆర్.సన్యాసినాయుడు పాల్గొన్నారు.

## అరసవల్లి ఈవోగా చంద్రశేఖర్ బాధ్యతల స్వీకరణ



బాధ్యతలు స్వీకరిస్తున్న ఈవో చంద్రశేఖర్

**అరసవల్లి, మార్చి 14:** అరసవల్లి సూర్యనారాయణ స్వామి దేవస్థానం ఈవోగా ఎస్.చంద్రశేఖర్ గురువారం సాయంత్రం బాధ్యతలు స్వీకరించారు. ఈవోకు ఆలయ ప్రధాన అర్చకుడు ఇప్పిలి శంకరశర్మ మంగళ వాయిద్యాలతో స్వాగతం పలికారు. స్వామిని దర్శించుకున్న అనంతరం అర్చకులు వేదమంత్రాలతో ఆశీర్వదించారు. స్వామి జ్ఞాపికను అందజేసారు. ఆలయ పాలకమండలి సభ్యులు మండవిల్లి రవి, లుకలాపు గోవిందరావు, పూర్వపు ఈవో హరిసూర్య ప్రకాష్, ఇన్‌చార్జి సూపరింటెండెంట్ కృష్ణమాచార్యులు, ఆలయ జూనియర్ అసిస్టెంట్ బీఎస్ చక్రవర్తి, అర్చకులు నేతింటి హరిబాబు, ఇప్పిలి రంజిత్‌శర్మ, దర్భముళ్ల శ్రీనివాసశర్మ, సర్వేయర్ దుర్గాప్రసాద్, వేద పండితులు ఆయన అభినం దనలు తెలియజేశారు.

## అయ్యో.. ధర్మాన



కిల్లిపాలెంలో నిలిచిన మంత్రి ధర్మాన కాన్వాయ్

● శంకుస్థాపన స్థలం తెలియక కాన్వాయ్ చక్కర్లు
● స్వాగతం పలికేందుకు కానరాని పార్టీ కేడర్

**శ్రీకాకుళం రూరల్, మార్చి 14:** సార్వత్రిక ఎన్నికల గడువు సమీపిస్తున్న వేళ.. రెవెన్యూశాఖ మంత్రి ధర్మాన ప్రసాదరావు కొద్దిరోజులుగా శంకుస్థాపనల హడావుడిలో మునిగిపోయారు. బుధవారం శ్రీకాకుళంలోని వైసీపీ కార్యాలయంలో పార్టీ ఆవిర్భావ దినోత్సవానికి కూడా హాజరు కాకుండా.. అభివృద్ధి పనుల్లో బిజీ అయిపోయారు. ఈ నేపథ్యంలో గురువారం కూడా శంకుస్థాపన కార్యక్రమానికి వెళ్లిన ఆయనకు గందరగోళ పరిస్థితి ఎదురైంది. శ్రీకాకుళం మండలం కిల్లిపాలెంలోని రోడ్లు, డ్రైనేజీ నిర్మాణ పనుల శంకుస్థాపనకు ఆయన కాన్వాయ్‌లో పయనమయ్యారు. కిలిపాలెం చేరుకోగానే కాన్వాయ్ ఒక్కసారిగా రోడ్డుపై నిలిచిపోయింది. శంకుస్థాపన స్థలం మంత్రి తోపాటు అనుచరులకు, బందోబస్తు నిర్వహిస్తున్న పోలీసులకు, కేడర్‌కు తెలియకపోవడంతో అసలు ఎక్కడికి వెళ్లాలో తెలియక అంతా అయోమయంలో పడ్డారు. ఈ క్రమంలో కాన్వాయ్‌ను నిలిపేశారు. షెడ్యూల్ ప్రకారం రెడ్డికిల్లిపాలెంలోని ఎంపీపీ స్కూల్ దగ్గర మంత్రి శంకుస్థాపనలు చేయాల్సి ఉంది. అయితే మంత్రి మాత్రం కిల్లిపాలెం హైస్కూల్‌కు చేరుకోవడంతో కొద్దిసేపు గందరగోళం నెలకొంది. అనుకోకుండా మంత్రి ధర్మాన ప్రత్యక్షమయ్యేసరికి గ్రామస్థులంతా అవాక్కయ్యారు. ఎక్కడ పనులకు అనుమతిచ్చారో కూడా తెలియకుండానే మంత్రి వచ్చారంటూ గుసగుసలాడుకున్నారు. కిల్లిపాలెంలో స్థానిక వైసీపీ నాయకులు, కేడర్ సైతం మంత్రి ధర్మాన ప్రసాదరావును ఆహ్వానించేందుకు రాకపోవడం చర్చనీయాంశమైంది.

## ఎస్ఈబీ ఏఎస్పీగా గంగాధర్



స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో ఏఎస్పీగా డి.గంగాధర్ గురువారం బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా ఎస్పీ జీఆర్ రాధికను ఆయన మర్యాదపూర్వకంగా కలుసుకుని పుష్పగుచ్ఛం అందజేశారు. విశాఖ అదనపు డీసీపీ (క్రైమ్)గా విధులు నిర్వహించిన గంగాధర్ బదిలీపై ఇక్కడికి వచ్చారు.

- శ్రీకాకుళం క్రైం


సంతబొమ్మాళి: నౌపడలో ప్రచారం చేస్తున్న టీడీపీ నాయకులు


నందిగాం: రథజనబొడ్డపాడులో కరపత్రాలు పంపిణీ చేస్తూ..


కంచిలి: చిలకలమెట్టలో సూపర్‌సిక్స్ కరపత్రాలు వివరిస్తూ..

# చంద్రబాబుతోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యం

● జిల్లాలో సూపర్‌సిక్స్ పథకాలపై టీడీపీ నాయకుల ప్రచారం


బూర్జ: సూపర్‌సిక్స్ పథకాలను వివరిస్తున్న కూన రవికుమార్

టీడీపీ అధినేత నారా చంద్రబాబునాయుడుతోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యని ఆ పార్టీ నాయకులు తెలిపారు. గురువారం జిల్లాలో బాబు ష్యూరిటీ-భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమంలో భాగంగా సూపర్‌సిక్స్ పథకాలపై టీడీపీ నాయకుల ప్రచారం నిర్వహించారు. ఈసందర్భంగా ఇంటింటికి వెళ్లి కరపత్రాలు అందజేశారు. పలుచోట్ల వైసీపీ నాయకులు టీడీపీలో చేరారు.

● **కవిటి:** టీడీపీతోనే అభివృద్ధి సాధ్యమని ఎమ్మెల్యే బెందాళం అశోక్ తెలిపారు. రాజపురం, చిన్నసహలాలపుట్టుగల్లో ఎంపీ నిధులతో నిర్మించిన కమ్యునిటీ భవనాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా చిన్నసహలాల పుట్టుగ గ్రామానికి చెందిన యర్ర చైతన్య, భగవాన్, సారథి, పి.అర్జున్, ఎర్ర మధు, పి.ప్రేమ్, జి.చింతామణి తదితర 50 కుటుంబాలు టీడీపీలో చేరాయి. కార్యక్రమంలో పార్టీ మండలాధ్యక్షుడు మణిచంద్ర ప్రకాష్, సదానంద రౌళో, టి.మోహనరావు, బి.చిన్నబాబు, బాసుదేవ్ ప్రదాన్ పాల్గొన్నారు.

● **బూర్జ:** సూపర్‌సిక్స్ పథకాలతో రాష్ట్రంలో మహిళాసాధికారిత సాధ్యమని టీడీపీ జిల్లా అధ్యక్షుడు కూన రవికుమార్ తెలిపారు. మండలంలోని గుత్తావల్లిలో సూపర్‌సిక్స్ శంఖారావం కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో జనసేన, టీడీపీ నాయకులు పేడాడ రామ్మోహన్, జడ్పీటీసీ మాజీ సభ్యుడు ఆనెపు రామకృష, సర్పంచ్ హనుమంతు మీనాక్షి, ఎంపీటీసీ కె.శ్రావణి, నాయకులు పైడి సత్యప్రసాద్, మండల అధ్యక్షుడు రాంజీ, హనుమంతు గోపి, కడగల కృష్ణ, శ్రీరామ్మూర్తి, గణపతి, జగన్నాథనాయుడు, కె.గోపి పాల్గొన్నారు.

● **సంతబొమ్మాళి:** గ్రామాల్లో టీడీపీతోనే అభివృద్ధి సాధ్యమని పార్టీ మండల అధ్యక్ష, కార్యదర్శులు జీరు భీమారావు,రెడ్డి అప్పన్న తెలిపారు. నౌపడలో సూపర్‌సిక్స్ పథకాలపై ఇంటింటా టీడీపీ నాయకులు ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు సుగ్గు స్వరూప్‌రెడ్డి, సూరాడ ధనరాజ్, బెండి అరుణ్‌కుమార్, కర్రి విష్ణుమూర్తి పాల్గొన్నారు.

● **కంచిలి:** చిలకలమెట్టలో సూపర్‌సిక్స్ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో టీడీపీ మండల కార్యదర్శి మాదిన రామారావు, బొడ్డ హరిబాబు, జి.మన్మథరావు, పైల మన్మథరావు, శ్రీకాంత్, కిరణ్, సతీష్ పాల్గొన్నారు.

● **సరుబుజ్జిలి:** సరుబుజ్జిలిలో టీడీపీ నాయకులు ఎండ రామారావు, దవళ సింహాచలం, పాతిన శ్రీనివాసరావు ఆధ్వర్యంలో సూపర్‌సిక్స్ శంఖారావం కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు దవళ సురేష్, బెండి రామ్మూర్తినాయుడు, కూన రమణ, చింతాడ ధనుంజయ పాల్గొన్నారు.

● **నందిగాం:** మండలంలోని రథజనబొడ్డపాడు, బడబంద, శివరాంపురంలో టీడీపీ మండలాధ్యక్షుడు పినకాన అజయ్‌కుమార్ ఆధ్వర్యంలో సూపర్‌సిక్స్ పథకాలపై ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో ఎం.బాలకష్ణ, ఎస్.జానకిరాం, బి.గిరిబాబు, కె.ధర్మారావు, ఎ.రమేష్, కె.ప్రసాదరావు, ఎన్.తిరుపతిరావు, శశి పాల్గొన్నారు.

● **పొందూరు:** మండలంలోని తోలాపిలో బాబు ష్యూరిటీ- భవిష్యత్తు గ్యారెంటీ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ పొన్నాడ రామారావు, బుజ్జి, ఉప సర్పంచ్ పి.శ్రీనివాసరావు పాల్గొన్నారు.

**ఇచ్ఛాపురం:** టీడీపీ అధినేత ప్రకటించిన సూపర్ సిక్స్ పథకాలతో ఇంటిల్లపాదికి లబ్ధి చేకూరుతుందని పార్టీ జిల్లా కార్యదర్శి 11వ వార్డు కౌన్సిలర్ ఆశి లీలారాణి అన్నారు. ఈ మేరకు గురువారం వార్డులో టీడీపీ అమలు చేయనున్న సంక్షేమ పథకాలపై ఇంటింటికీ వెళ్లి అవగాహన కల్పించారు.


పొందూరు: తోలాపిలో బాబు ష్యూరిటీ కార్యక్రమంలో..


ఇచ్ఛాపురం: పథకాలపై అవగాహన కల్పిస్తున్న లీలారాణి


సరుబుజ్జిలి: సూపర్‌సిక్స్ పథకాలపై అవగాహన కల్పిస్తూ..


అరసవల్లి: శ్రీకాకుళంలో ర్యాలీ నిర్వహిస్తున్న సీఐటీయూ నాయకులు



జి.సిగడాం: ర్యాలీలో పాల్గొన్న సీఐటీయూ, కౌలురైతు సంఘ నాయకులు


టెక్కలి: ధర్నా చేస్తున్న రైతు, ప్రజా సంఘాలు, వివిధ రాజకీయ పార్టీల నాయకులు



నరసన్నపేట: పెద్దకరగాంలో ధర్నాచేస్తున్న ప్రజాసంఘాల నాయకులు


కాశీబుగ్గలో నిరసన తెలుపుతున్న వామపక్ష నాయకులు

# ఎంఎస్పీ చట్టం చేయాలి

● కేంద్ర ప్రభుత్వ వైఖరిపై జిల్లా వ్యాప్తంగా ప్రజాసంఘాలు, వామపక్షాల ఆధ్వర్యంలో నిరసనలు

తక్షణమే కనీసమద్దతు ధర(ఎంఎస్పీ) చట్టం చేయాలని ప్రజాసంఘాలు, వామపక్షాల డిమాండ్‌చేశాయి. ఈమేరకు గురువారం జిల్లా వ్యాప్తంగా గురువారం కేంద్ర ప్రభుత్వ రైతు,కార్మిక విద్రోహ చర్యలకు వ్యతికంగా డిల్లీలో జరుగుతున్న పోరాటానికి మద్దతుగా నిరసన తెలిపాయి.

● **నరసన్నపేట:** స్వామినాథన్ కమిటీ సిపారసుల మేరకు రైతులు పండించే అన్ని పంటలకు మద్దతు ధర కల్పించే చట్టం అమలు చేయాలని ఎస్‌కేఎం, అఖిల భారత రైతుకూలీ సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి తాండ్ర ప్రకాశ్ డిమాండ్ చేశారు. పెద్దకరగాంలో ప్రజాసంఘాల నాయకులు ధర్నా నిర్వహించారు. కార్యక్రమంలో ప్రజాసంఘాల నాయకులు సన్నశెట్టి రాజశేఖర్, నేతింటి నీలంరాజు పాల్గొన్నారు.

● **టెక్కలి:** సంయుక్త కిసాన్ మోర్చా పిలుపు మేరకు రైతుల చలో డిల్లీకి మద్దతుగా టెక్కలిలో సీపీఎం, కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రైతులకు ఇచ్చిన హామీలు అమలు చేయాలని కోరారు. కార్యక్రమంలో కాంగ్రెస్ కిసాన్ సెల్ అధ్యక్షులు కోత మధు, పొట్నూరు ఆనందరావు, సాసుమాను ధర్మ, సీపీఎం నాయకులు నంబూరు షణ్ముఖరావు, సీఐటీయూ నాయకులు ఈశ్వరరావు, కొల్లి ఎల్లయ్య, సాంబమూర్తి, దాట్ల లింగమూర్తి, శంకరప్రసాద్‌రెడ్డి, ధనుంజయరావు, బగాది వాసుదేవరావు, గౌరమ్మ పాల్గొన్నారు.

● **కాశీబుగ్గ:** దేశాన్ని కార్పొరేట్లకు తాకట్టుపెడుతున్న మోదీని గద్దె దింపే వరకూ పోరాటం ఆగదని వామపక్ష నాయకులు గణపతి, వెంకట రమణ, సన్యాసిరావు, మాధవరావు, హేమారావు తెలిపారు. కాశీబుగ్గ గాంధీ విగ్రహం వద్ద పలాస రైతు,కార్మిక సంఘాల ఐక్య వేదిక ఆధ్వర్యంలో నిరస న తెలిపారు. కార్యక్రమంలో వామపక్ష నాయకులు భాస్కరరావు, భానమ్మ, భీమారావు శ్రీనివాస్,లోకనాధం,శ్యామ్‌సుందరరావు,సాయమ్మ పాల్గొన్నారు.

● **జి.సిగడాం:** కేంద్రప్రభుత్వం కార్మికహక్కులను కాలరాస్తోందని కౌలు రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు వెలమల రమణ, సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు అమ్మన్నాయుడు ఆరోపించారు. జి.సిగడాంలో కౌలు రైతు, సీఐటీయూ ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో సంఘ నాయకులు ఎస్.జగదీశ్వరరావు, రేగాన శివుడు, రెడ్డి గన్నిరాజు, వై.లక్ష్మణరావు పాలొన్నారు.

● **అరసవల్లి:** కేంద్రప్రభుత్వం రైతాంగానికి ఇచ్చిన హామీలను అమలు చేయాలని సీఐటీయూ ప్రధాన కార్యదర్శి పి.తేజేశ్వరరావు, రైతు సంఘం జిల్లాకార్యదర్శి కె.మోహనరావు, వ్యవసాయ కార్మికసంఘం జిల్లాప్రధాన కార్యదర్శి జి.సింహాచలం డిమాండ్ చేశారు. కేంద్ర ప్రభుత్వ విధానాలకు వ్యతరేకంగా రైతులు నిర్వహిస్తున్న చలో డిల్లీకి మద్దతుగా శ్రీకాకుళంలోని డైమండ్ పార్కు నుంచి ఏడురోడ్ల జంక్షన్ వరకు ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో సీఐటీయూ పట్టణ కన్వీనర్ ఆర్.ప్రకాశరావు, కోకన్వీనర్ ఎం.గోవర్ధనరావు, వివిధ కార్మిక, ప్రజా సంఘాల నాయకులు పి.చంద్రరావు, ఎస్.బలరాం పాల్గొన్నారు.



## ఎన్నికల విధుల్లో అప్రమత్తంగా వ్యవహరించాలి

**టెక్కలి:** ఎన్నికల విధుల నిర్వహణలో అధికారులు అప్రమత్తంగా వ్యవహరించాలని సబ్‌కలెక్టర్, టెక్కలి నియోజకవర్గ ఎన్నికల రిటర్నింగ్ అధికారి నూరుల్ కమర్ తెలిపారు. గురువారం టెక్కలి సబ్‌కలెక్టరేట్‌లో స్టేటస్టిక్స్ సర్వేలైన్స్ బృందాలు, ఫ్లయింగ్ స్క్వాడ్, వీడియో సర్వేలైన్ బృందాలతో సమావేశం నిర్వహించారు. మోడల్ కోడ్ ఆఫ్ కాండక్ట్‌పై అవగాహన కలిగించారు.

### నిబంధనలు అమలు చేయాలి

**నరసన్నపేట** ఎన్నికల నోటిఫికేషన్ వచ్చిన వెంటనే పక్కాగా కోడ్ నిబంధనలు అమలుచేయాలని ఆర్వో రామ్మోహన్‌రావు సూచించారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో కార్యదర్శులు, వీఆర్వోలతో సమావేశం నిర్వహించారు.కార్యక్రమంలో తహసీల్దారు కనకరావు, సంధ్య, డీటీ శ్రీనివాసరావు పాల్గొన్నారు.

### పోలింగ్ కేంద్రాల్లో మౌలిక సౌకర్యాలు కల్పించాలి

**పాతపట్నం:** పోలింగ్ కేంద్రాల్లో కనీస మౌలిక సౌకర్యాలు ఉండాలని ఎన్నికల రిటర్నింగ్ అధికారి ఎం.అప్పారావు తెలిపారు. పాతపట్నంలో నియోజకవర్గం పరిధిలోని పాతపట్నం, కొత్తూరు, హిరమండలం, ఎల్ఎన్‌పేట, మెళియాపుట్టి మండలాల తహసీల్దార్లు వైఎస్‌వీవీ ప్రసాదరావు, ఎంవీవీ ప్రసాద్, బి.సుధాకర్, రాణి అమ్మాజీ, కె.జానకమ్మ, ఆర్ఎస్ డీటీ సునీల్ సమావేశం నిర్వహించారు.

## నరసన్నపేటలో అంతర్జాతీయ గణిత దినోత్సవం

**నరసన్నపేట:** నరసన్నపేట, సత్యవరం ప్రభుత్వపాఠశాలలోగురువారం అంతర్జాతీయ గణిత దినోత్సవం పురస్కరించుకుని విద్యార్థులకు క్విజ్‌పోటీలను నిర్వహించారు. సత్యవరం ఉన్నతపాఠశాల, ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో గణితం ఆవశ్యకతను వివరించారు. పైఆకారంలో సత్యవరం పాఠశాల విద్యార్థులు కూర్చొన్నారు.

## నిబంధనలకు అనుగుణంగా అనుమతులు: డీఐవోఎస్

**ఎల్.ఎన్.పేట:** నిబంధనలకు అనుగుణంగా మిల్లులు, చిల్లర వ్యాపారాలకు భవన నిర్మాణాలకు అనుమతులు ఇవ్వనున్నట్లు టెక్కలిడివిజినల్ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ సర్వే (డీఐవోఎస్) ఎం.జనార్దనరావు తెలిపారు. గురువారం తాయిమాంబ పురంలో అనుమతులకు దరఖాస్తుచేసుకున్న యజమానుల భూములను పరిశీలించారు. ఆయనతోపాటు మండల సర్వేయరు గవరయ్య సచివాలయ సర్వేయర్లు ఉన్నారు.

## ప్రభుత్వ భూముల ఆక్రమణ నేరం: తహసీల్దార్

**జలుమూరు:** ప్రభుత్వ పోరంబోగు భూములు ఆక్రమించడం నేరమని తహసీల్దార్ సీహెచ్ నాగమ్మ తెలిపారు.గురువారం జలుమూరు ఎస్సీకాలనీ వెనుక సర్వేనెంబరు 187-1ఎలో గల ప్రభుత్వ పోరంబోగు భూమి వద్ద హెచ్చరిక బోర్డులు ఏర్పాటుచేశారు. కార్యక్రమంలో డిప్యూటి తహసీల్దార్ పి.శ్రీనివాసరావు, ఆర్ఐ సతీష్‌కుమార్, సర్వేయర్ తర్ర నాగేశ్వరరావు, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

## కిడ్నీ రోగుల కౌన్సెలింగ్ కేంద్రం ప్రారంభం

**పలాస:** పలాసలోని కిడ్నీపరిశోధన కేంద్రం,200 పడకల ఆసుపత్రి ప్రాంగణంలో ప్రపంచ కిడ్నీ దినోత్సవం పురస్కరించుకుని కిడ్నీ రోగులకు కౌన్సెలింగ్ కేంద్రాన్ని ఆసుపత్రి సూపరింటెండెంట్ అల్లు పద్మజ గురువారం పారంభించారు. ఈసందర్భంగా వైద్యాధికారులు, మీడియాకు కిడ్నీ రోగులకు అందజేస్తున్న సేవలు, భవిష్యత్‌లో వ్యాధి రాకుండా తీసుకోవాల్సిన చర్యలపై ద జార్జ్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ గ్లోబల్ హెల్త్ సమన్వయకర్త డాక్టర్ విజయబాలాజి పవర్‌పాయంట్ ప్రెజెంటేషన్ ద్వారా వివరించారు. కార్యక్రమంలో ఆసుపత్రి డీన్‌మోహన్‌బాబు, వైద్యా ధికారులు రాకేష్, సందీప్, కిషోర్, భాగ్యరాజ్, కూర్మారావు, శ్రీనివాస్, వెంకటసాయి భార్గవ్,సుదర్శన పాల్గొన్నారు.

### పరీక్ష సామగ్రి పంపిణీ

**పాతపట్నం:** పెద్దలోగిడి జడ్పీ పాఠశాలలో పదో తరగతి విద్యార్థులకు గ్రామానికి చెందిన యూత్ అసోసియేషన్ సభ్యులు ప్లాంక్‌లు, పెన్నులు పెన్సిళ్లు, స్కేళ్లు, మెండర్, ఎరైజర్ తదితర పరీక్ష సామగ్రిని గురువారం పంపిణీ చేశారు. కార్యక్రమంలో సభ్యులు ప్రదీప్, అశోక్, వెంకటేశ్, హెచ్‌ఎం రాజగోపాలరావు పాల్గొన్నారు.




## గరుడుభద్రలో ఆర్బీకే ప్రారంభం

**వజ్రపుకొత్తూరు:** గరుడుభద్రలో ఆర్బీకే, మర్రిపాడులో పాఠశాల, చీపురుపల్లి పంచాయతీలో సచివాలయ భవనాలను మంత్రి అప్పలరాజు గురువారం ప్రారంభించారు.రాకాశిగడ్డపై వంతెన నిర్మాణానికి భూమిపూజ చేశారు.

**నందిగాం:** నందిగాం, దేవుపురంలో గ్రామ సచివాలయం-1, ఆర్బీకే, వెల్‌నెస్ సెంటర్లను వైసీపీ జిల్లా సమన్వయకర్త పేడాడ తిలక్, ఎంపీపీ నడుపూరు శ్రీరామ్మూర్తి ప్రారంభించారు. కార్యక్రమంలో సర్పంచ్‌లు జద్యాడ రవణమ్మ, యర్ర విశ్వశాంతి పాల్గొన్నారు.

## దొంగతనాలపై అప్రమత్తంగా ఉండాలి

**పాతపట్నం:** దొంగతనాలపై అప్రమత్తంగా ఉండాలని సీఐ నల్లి సాయి తెలిపారు. స్థానిక పోలీస్‌స్టేషన్‌లో పాతపట్నం, మెళియాపుట్టి మండలాల రైస్‌మిల్లర్లతో గురువారం సమావేశం నిర్వహించారు. సమావేశంలో పాతపట్నం, మెళియాపుట్టి ఎస్ఐలు మహమ్మద్ యాశిన్, టి.రాజేష్ పాల్గొన్నారు.

## ప్రకృతి వ్యవసాయంపై ఆసక్తి అవసరం

**టెక్కలి:** రైతులు సేంద్రీయ, ప్రకృతి వ్యవసాయంపై ఆసక్తి పెంచుకుని అధిక దిగుబడులు సాధించాలని రావివలస గ్రామీణ వ్యవసాయ సహాయకులు ఆర్.విక్టర్, డి.శిరీష తెలిపారు. గురువారం రావివలసలో ఏర్పాటు చేసిన ఎన్ఎస్ఎస్ సేవా శిబిరంలో భాగంగా రైతులకు వేప కషాయం, బ్రహ్మాస్త్రం, ఘన, ద్రవ, జీవామృతాలు వల్ల కలుగు ప్రయోజనాలు వివరించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ గోవిందమ్మ, పీవో లూక్‌పాల్, వైస్‌ప్రిన్సిపాల్ డాక్టర్ సతీష్‌లు ఉన్నారు.

## కొండలు తవ్వి గ్రావెల్ తరలింపు

**నందిగాం:** మండలంలోని పలు ప్రాంతాల్లో గల కొండలను తవ్వి గ్రావెల్‌ను యథేచ్ఛగా తరలిస్తున్నారు. తురకలకోట సమీపంలోని సర్వేనెంబరు 296లోగల అచ్చుకొండలోని ఎర్రటి గ్రావెల్‌ను యంత్రాలతో తవ్వి ట్రాక్టర్లలో రవాణాచేస్తున్నారు. భైరిబొడ్డపాడు, కైజోల తదితర ప్రాంతాల్లో కూడాఅనుమతి లేకుండా కొండలను తవ్వి గ్రావెల్ తరలిస్తున్నారని ఆయా గ్రామస్థులు చెబుతున్నారు. కాగా ఇప్పటికే పోలీస్, స్పెషల్‌బ్రాంచ్, గనులశాఖ అధికారులకు జిల్లా కలెక్టర్ ఆదేశాలు ప్రాప్తికి గ్రావెల్ పరిరక్షణకు చర్యలు చేపట్టినట్లుతహసీల్దార్ వి.పద్మావతి తెలిపారు. ఈవిషయంపై విచారణ చేపట్టి చర్యలుతీసుకుంటామని చెప్పారు.


అచ్చుకొండలో గ్రావెల్ తవ్వుతున్న దృశ్యం

## ప్రభుత్వ భూములను కాపాడాలి: శిరీష


పలాస రూరల్: ఆర్డీవోకు వినతిపత్రం అందజేస్తున్న గౌతు శిరీష

**పలాస రూరల్:** పలాస-కాశీబుగ్గ మునిసిపాలిటీ పరిధి పురుషోత్తపురం రెవెన్యూపరిధిలో గల ప్రభుత్వ భూము లను కాపాడాలని టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గౌతు శిరీష కోరారు. ఇక్కడ భూములు వైసీపీ నాయకులు స్వాధీనం చేసుకుంటుండడంతో చర్యలు చేపట్టాలని డిమాండ్‌చేశారు.ఈమేరకు పలాస ఆర్డీవో భరత్‌నాయక్‌కు వినతిపత్రం అందజేశారు. ఈసందర్భంగా మాట్లాడుతూ పురుషోత్తపురం ఎర్రచెరువు గర్భంలో ఉన్న 29-ఎలో 26.80సెంట్ల భూమిని వైసీసీ నాయకులు ఆక్రమించుకొని నకిలీ డాక్యుమెంట్లతో రిజిస్ట్రేషన్ చేశారని తెలిపారు. చారణ జరిపించి చర్యలు చేపట్టాలని ఆర్డీవోను కోరారు.

**పలాస:** పారిశుధ్య కార్మికులకు మెరుగైన జీవనం అందించడానికి కృషి చేస్తామని టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గౌతు శిరీష తెలిపారు. పలాస టీడీపీ కార్యాలయంలో మునిసిపల్ పారిశుధ్య కార్మికులు శిరీషకు సమస్యలను విన్నవించారు. టీడీపీ ప్రభుత్వం అధికారంలోకి వస్తే తమకు గుర్తింపు ఇవ్వాలని ఆమెను కోరారు.

## 17న విశ్వ కల్యాణ భవన్ ప్రారంభం

**హిరమండలం:** హిరమండలం పోలీస్ స్టేషన్ ఎదురుగా నిర్మించిన విశ్వకల్యాణ భవన్ ఈనెల 17నప్రారంభించనున్నట్లు బ్రహ్మకుమారీలు సుధారాణి, బీకే మోహిణి తెలిపారు.గురువారం హిరమండలంలోవారు విలేకరులతో మాట్లాడుతూ 17వ తేదీ సాయంత్రం నాలు గు గంటలకు పూర్ణకలశాలతో శివుని ఊరేగించనున్నట్లు పేర్కొన్నారు. 18న శివ ధ్వజ ఆవిష్కరణ జరుగుతుందని తెలిపారు.

## 21న అప్పలసూరి స్మారకసభ

**పలాసరూరల్:** నరసన్నపేట మండలం కోమర్తిలో ఈనెల 21న జరిగే రైతాంగ పోరాటయోధుడు మామిడి అప్పలసూరి స్మారకసభ విజయవంతంచేయాలని ప్రజా సంఘాలు కోరాయి. ఈమేరకు గురువారం పలాస మండలంలోని మామిడిపల్లిలో ప్రజాసంఘాల ఆధ్వర్యంలో అప్పలసూరి 27వ వర్ధంతి పురస్కరించుకుని కరపత్రాలు ఆవిష్కరించారు. కార్యక్రమంలో సీపీఐఎంఎల్ న్యూడెమోక్రసీ జిల్లా నాయకులు గోరకల బాలకృష్ణ, జిల్లా ప్రధాన కార్యదర్శి కుసుమ, ఆర్.మాధవరావు, అప్పారావు, కామేశ్వరరావు, పున్నయ్య, లోకనాథం, మాధవరయ్య, అప్పలస్వామి, బారికయ్య పాల్గొన్నారు.

## ఘనంగా మీన సంక్రమణం పూజలు

**పలాస రూరల్:** పలాసలోని సీతారామాలయ కాంప్లెక్స్‌లోగల జగన్నాథాలయంలో జైజగన్నాథ్‌ఒడియా బ్రాహ్మణ సంఘం ఆధ్వర్యంలో గురువారం మీన సంక్రమణం పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో సంఘ కార్యదర్శి బాబూరావు, సభ్యులు రాఘవ పండా, దాసు పాల్గొన్నారు.

## విదేశీ విద్యపై అవగాహన

**టెక్కలి:** కె.కొత్తూరుదరి ఆదిత్య ఇంజనీరింగ్ కళాశాలలో కెరియం గైడెన్స్‌సెల్ ఆధ్వర్యంలో గురువారం విశాఖకు చెందిన యూనీ ఎక్స్‌పర్ట్ ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీ బ్రాంచ్ మేనేజర్ అనితాకొమ్మరాజు విద్యార్థులకు విదేశీ విద్యపై అవగాహన కల్పించారు. అమెరికా, బ్రిటన్, కెనడా, ఆస్ట్రేలియాల్లో ఉన్నత విద్యనభ్యసించడం వల్ల కలిగే ప్రయోజనాలు, ఉద్యోగావకాశాలు, చదువుకోవడానికి బ్యాంకులు ఏవిధంగా రుణాలు ఇస్తారు అంశాలపై వివరించారు. కార్యక్రమంలో డైరెక్టర్ వీవీ నాగేశ్వరరావు, ప్రిన్సిపాల్ డాక్టర్ శ్రీనివాసరావు, ప్రొఫెసర్ డాక్టర్ యుగంధర్, కో-ఆర్డినేటర్ కె.రామ్మోహన్ పాల్గొన్నారు.

## రామకృష్ణ సేవా సంఘానికి వితరణ

**పలాస:** పలాసలోని శ్రీరామకృష్ణ సేవాసంఘం ద్వారా నిర్వహిస్తున్న గ్రంథాలయానికి కాశీబుగ్గ సీఐ విజయానంద్ ఆధ్వర్యంలో పోటీ పరీక్షల పుస్తకాలు, వాటర్ ప్యూరిఫైర్‌నునిర్వాహకులకు అందించారు. ఎస్పీ ఆదేశాల మేరకు తాము వీటిని అందిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో సంఘ అధ్యక్షుడు వాసు, శ్రీనివాస్, సభ్యులు పాల్గొన్నారు.

### పాఠశాలకు సౌండ్ సిస్టమ్

**సంతబొమ్మాళి:** మండలంలోని దండుగోపా లపురం జడ్పీ ఉన్నత పాఠశాల పూర్వవిద్యార్థులు పదివేల రుపాయల విలువగల సౌండ్ సిస్టమ్ అందజేశారు. ఇక్కడ 2022-23 పదో తరగతిలో చదివి నూజివీడు ఐఐటీలో సీట్లు సాధించిన కె.సాధన ప్రియ, కె.కావ్యశ్రీ, కె.చాందినిలకు రూ.మూడు, రెండు, వెయ్యి చొప్పున ప్రభుత్వ పురస్కారం లభించింది. దీనికి కొంత డబ్బులు వేసి పాఠశాలకు సౌండ్ సిస్టమ్‌ను అందజేశారు. కార్యక్రమంలో హెచ్‌ఎం కోత చైతన్య, ఉపాధ్యాయులు భాస్కరరావు, వీరభద్రరావు, ఆదికేవశరెడ్డి పాల్గొన్నారు.

## కృష్ణమూర్తికి ప్రాశ్నిక పురస్కారం

**పలాసరూరల్:** జనజాగృతి సాహితీసంస్థ గౌరవాధ్యక్షుడు తెప్పలకృష్ణమూర్తికి ఒడిశాలోని రాగయడలో ఉత్కళాంధ్రుల బ్రాహ్మణ సేవా సమాజం 27వ వార్షికోత్సవం పురస్కరించుకుని నిర్వహించిన శతావధానంలోశతావధాన ప్రాశ్నిక పురస్కారం లభించింది. కార్యక్రమంలో ప్రాశ్నికునిగా పాల్గొని హరిని పెండ్లి యాడే గురిధరుండు అన్న సమస్య, సంగీతం,సాహిత్యం,నృత్యం, శిల్పం అన్నదత్త పది అంశాలపై అవధానులకు సంతృప్తికర పూరణం ఇవ్వడంతో అవార్డును అందుకున్నారు.కృష్ణమూర్తికి లలితకళా రంజని, ఉద్దానసాహితివేదిక ప్రతినిధులు అభినందించారు.












## దిమిలి వీఆర్వో సస్పెన్షన్

**కలెక్టరేట్:** కొత్తూరు మండలం, దిమిలి గ్రామ వీఆర్వోగా పనిచేస్తున్న కె.రమేష్ రాజకీయ పార్టీ ప్రచార కార్యక్రమాల్లో పాల్గొంటున్నట్టు క్రమశిక్షణా అధికారి అయిన జిల్లా ఎన్నికల అధికారి దృష్టికి వచ్చింది. దీనిపై విచారణ నిర్వహించి ఆరోపణలు నిజమని తేలడంతో ఆ వీఆర్వోను క్రమశిక్షణా చర్యల్లో భాగంగా సస్పెండ్ చేసినట్టు డీఆర్వో ఎం.గణపతిరావు గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

## అపస్మారక స్థితిలో యువకుడు

**జలుమూరు (సారవకోట):** అలుదు ఉన్నతపాఠశాల సమీపంలో ఓ వ్యక్తి గురువారం పేలుమందు తాగి అపస్మారకస్థితికి చేరుకున్నాడు. ఈ విషయాన్ని స్థానికులు గుర్తించి పోలీసులకు సమాచారం అందజేశారు. అపస్మారకస్థితిలో ఉన్న ఆ వ్యక్తిని సారవకోట పీహెచ్‌సీకి తరలించి ప్రథమ చికిత్స అందించారు. అనంతరం మెరుగైన వైద్యం కోసం 108లో శ్రీకాకుళం సర్వజన ఆసుపత్రికి తరలించారు. స్థానికుల కథనం మేరకు.. జలుమూరు మండలం జోనంకి పంచాయతీకి చెందిన ఓ యువకుడుకి సారవకోట మండలంలోని సత్రాం గ్రామానికి చెందిన యువతితో వివాహం జరిగింది. వీరికి కుమారుడు, కుమార్తె ఉన్నారు. ఆ యువతి సత్రాంలోని కన్నవారు ఇంట్లో నాలుగు నెలలుగా ఉంటోంది. విజయవాడలో పనిచేసుకుని జీవిస్తున్న ఆమె భర్త రెండు రోజుల కిందట జోనంకి వచ్చి గురువారం సత్రాం వెళ్లాడు. తన భార్యను రావాలని కోరాడు. భార్య వచ్చేందుకు నిరాకరించడంతో అలుదు పాఠశాలలో చదువుతున్న తన కుమార్తె వద్దకు వెళ్లాడు. తన కుమార్తెకు తనవద్ద ఉన్న ఏటీఎం, రూ.500లు ఇచ్చి పాఠశాల సమీపంలోనే తన వెంట తెచ్చుకున్న పేలు మందును తాగి అపస్మారకస్థితికి చేరుకున్నాడు.

## రోడ్డు ప్రమాదం.. ఆదుకున్న ఎమ్మెల్యే సతీమణి


బాధితులతో మాట్లాడుతున్న నీలోత్పల

**కవిటి:** బొరివంక సబ్‌స్టేషన్ సమీపంలో గురువారం రోడ్డు ప్రమాదం జరిగింది. అదే సమయంలో అటుగా వస్తున్న ఎమ్మెల్యే బెందాళం అశోక్ సతీమణి నీలోత్పల తన వాహనంలో ఎక్కించి గ్రామానికి చేర్చిన ఘటన చోటుచేసుకుంది. సోంపేట మండలం పలాసపురం గ్రామానికి చెందిన డి.ధర్మారావు తన కుటుంబ సభ్యులతో కలసి కె.కపాసుకుద్ది వెళ్లేందుకు కారులో కవిటి వైపు వస్తున్నారు. బొరివంక సబ్‌స్టేషన్ సమీపంలోని మలుపు వద్ద కారు అదుపుతప్పి రోడ్డు పక్కనున్న విద్యుత్ స్తంభాన్ని ఢీకొట్టింది. ఇదే సమయంలో ఎన్నికల ప్రచారాన్ని ముగించుకొని కవిటి వస్తున్న ఎమ్మెల్యే సతీమణి నీలోత్పల స్పందించి ప్రమాదానికి గురైన వారిని తన వాహనంలో ఎక్కించి వారి గ్రామానికి చేర్చారు. ఈ ప్రమాదంలో చిన్నారులతో కుటుంబ సభ్యులంతా ఉన్నా ఎవరికీ ఎలాంటి గాయాలు కాలేదు. సమయానికి ఆదుకున్న ఎమ్మెల్యే సతీమణికి, టీడీపీ కార్యకర్తలకు పలువురు కృతజ్ఞతలు తెలిపారు.

## వలస కూలీకి ఓటు నిరాకరణ

**సరుబుజ్జిలి:** గోనుపాడు గ్రామానికి చెందిన వలస కూలి కోరాడ ఢిల్లీశ్వరి ఓటు నమోదుకు దరఖాస్తు చేయగా, దానిని అధికారులు నిరాకరించారు. దీనిపై టీడీపీ నాయకులు అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారు. టీడీపీ నాయకుడు సేపాన శ్రీరామ చంద్రమూర్తి అందించిన వివరాల మేరకు.. యాదవ కులానికి చెందిన ఢిల్లీశ్వరి జీవనోపాధి కోసం హైదరాబాద్ వెళ్లి అప్పుడప్పుడు గ్రామానికి వస్తుంటుంది. ఆమె గ్రామంలో డ్వాక్రా సభ్యురాలిగా ఉంది. ఈమె రేషన్‌కార్డు, ఆధార్‌కార్డుతో పాటు ఇద్దరు పిల్లలు కూడా ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్నారన్నారు. గతంలో ఆమెకు గోనుపాడు గ్రామంలో ఓటు లేనందున ఈ ఏడాది జనవరి 22న ఓటరుగా నమోదు చేయాలని ఫారం-6 బీఎల్‌వోకు అందించగా ఇప్పుడు ఆ దరఖాస్తును తిరస్కరించారు. అయితే అదే గ్రామంలో ఉన్న వైసీపీ సానుభూతి పరుడైన ఒక వ్యక్తికి ఓటర్ల జాబితాలో ఓటు ఉన్నా అదనపు ఓటు కోసం దరఖాస్తు చేస్తే అధికారులు ఆమోదించడంపై సర్వత్రా విమర్శలు వినిపిస్తున్నాయి. తహసీల్దార్ జె.రమేష్‌బాబును గురువారం కలిసి వలసకూలికి ఓటు కల్పించకపోవడంపై ప్రశ్నించగా.. ఆమె ప్రస్తుతం ఇక్కడే ఉంటే ఓటు హక్కు కల్పిస్తానంటూ సమాధానం ఇచ్చారంటూ రామచంద్రమూర్తి తెలిపారు. ఈ విషయమై పార్టీ అధిష్ఠానం దృష్టికి తీసుకువెళ్లి కోర్టును ఆశ్రయించనున్నట్టు ఆయన తెలిపారు.

## ముమ్మరంగా ప్రారంభోత్సవాలు

**సరుబుజ్జిలి:** ఎలక్షన్ కోడ్ ఎన్నికల సంఘం ఏ క్షణాన వదులుతుందోన్న ఆతృతతో స్పీకర్ తమ్మినేని సీతారాం ముమ్మరంగా ప్రారంభోత్సవాలు చేపట్టారు. దీనిలో భాగంగా గురువారం సరుబుజ్జిలి మండలం రొట్టవలస గ్రామంలో నూతనంగా నిర్మించిన రక్షిత నీటి పథకం ఆరోగ్య ఉప కేంద్రం పాలకేంద్రం నాడు-నేడు నిధులతో నూతనంగా నిర్మాణం చేపట్టిన జిల్లా పరిషత్ ఉన్నత పాఠాల భవనాలు ప్రారంభించారు. సరుబుజ్జిలి మండల కేంద్రంలో రాష్ట్ర గిడ్డింగుల సంస్థ ఆధ్వర్యంలో నిర్మాణం చేపట్టారు. కార్యక్రమంలో రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్ కరిముల్లా జిల్లా గిడ్డంగుల సంస్థ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## ప్రశాంత ఎన్నికలే లక్ష్యం

**పొందూరు:** రాష్ట్రంలో త్వరలో జరగబోయే సాధారణ ఎన్నికలు ప్రశాంతంగా నిర్వహించడమే లక్ష్యమని ఎస్ఐ వై.రవికుమార్ అన్నారు. దళ్లిపేట, పుల్లాజిపేట, కృష్ణాపురం, బాణాం తదితర గ్రామాల్లో గురువారం పోలీసు కవాతు నిర్వహించారు. చట్టాన్ని అతిక్రమిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. గొడవలు జరుగకుండా బైండోవర్ కేసులు నమోదు చేస్తామన్నారు.

## ప్రారంభోత్సవాలన్నీ ఎన్నికల స్టంటే


విలేకరులతో మాట్లాడుతున్న టీడీపీ నాయకులు

**ఆమదాలవలస:** నియోజకవర్గంలో స్పీకర్ తమ్మినేని సీతారాం ఎన్నికల స్టంట్‌లో భాగంగానే అసంపూర్తి నిర్మాణాలకు ప్రారంభోత్సవాలు చేస్తున్నారని టీడీపీ లీగల్ సెల్ రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని విద్యాసాగర్, బీసీ సెల్ రాష్ట్ర కార్యదర్శి బోర గోవిందరావు ధ్వజమెత్తారు. ఇటీవల స్పీకర్ తమ్మినేని ఆదరాబాదరాగా ప్రారంభించిన మున్సిపాలిటీ పరిధిలోని జగ్గు శాస్త్రులపేట టిడ్కో గృహ సముదాయ ప్రాంతంలో గురువారం పార్టీ నాయకులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా వారు విలేకరులతో మాట్లాడుతూ.. టీడీపీ పాలనలో మున్సిపాలిటీ పరిధిలో ఉన్న 528 మందికి ఇక్కడ ఇళ్ల నిర్మాణాలు చేపట్టామన్నారు. ఇంతలో ఎన్నికలు రావడం.. అధికారంలోకి వచ్చిన వైసీపీ వీటిని పట్టించుకోలేదన్నారు. ఇప్పుడు ఎన్నికలు సమీపించడంతో బూటకపు ప్రారంభోత్సవాలు చేస్తున్నారని, దీనిని ప్రజలు గ్రహిస్తున్నారని రానున్న ఎన్నికల్లో బుద్ధి చెప్పడం ఖాయమన్నారు. కార్యక్రమంలో మాజీ మున్సిపాల్ చైర్మన్ కూన అప్పలనాయుడు, టిడిపి నాయకులు సంపత్‌రావు, మురళీధరరావు, నాగళ్ల మురళీధర్, ఎన్ని శ్రీదేవి పాల్గొన్నారు.

## ఎక్కువ కేసులు రాజీ అయ్యేలా చూడండి


మాట్లాడుతున్న న్యాయాధికారి జ్యోత్స్న

**పొందూరు:** ఈ నెల 16న నిర్వహించనున్న జాతీయ లోక్‌అదాలత్‌ను కక్షిదారులు వినియోగించుకోవాలని జూనియర్ సివిల్ కోర్టు న్యాయాధికారి, మండల న్యాసేవా ధికార సంస్థ చైర్‌పర్సన్ బి.జ్యోత్స్న సూచించారు. మండల కేంద్రంలో కోర్టు హాల్‌లో విలేఖరులు, పోలీసులు, బార్ అసోసియేషన్ సభ్యులతో సమావేశం నిర్వహించారు. లోక్‌అదాలత్‌లో రాజీకి అవకాశం లేని కేసులు మినహా మిగిలిన కేసులు రాజీ జరిగేలా పోలీసులు, గ్రామపెద్దలు కక్షిదారులకు నచ్చజెప్పాలని సూచించారు.

# గ్రూప్-1లో అక్రమాలు.. వైసీపీ అవినీతికి పరాకాష్ఠ

- తక్షణమే జగన్‌రెడ్డి రాజీనామా చేయాలి
- మాజీ ఎమ్మెల్యే గుండ లక్ష్మీదేవి


నిరసన తెలుపుతున్న గుండ లక్ష్మీదేవి తదితరులు

**అరసవల్లి:** గ్రూప్-1 మెయిన్స్ నిర్వహణలో అక్రమాలు జరిగాయంటూ సాక్షాత్తు హైకోర్టు చెప్పడం వైసీపీ అవినీతికి పరాకాష్ఠ అని మాజీ ఎమ్మెల్యే, శ్రీకాకుళం నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి గుండ లక్ష్మీదేవి అన్నారు. స్థానిక ఏడురోడ్ల జంక్షన్ వద్ద గురువారం సాయంత్రం పార్టీ శ్రేణులతో కలిసి నిరసన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా లక్ష్మీదేవి మాట్లాడుతూ.. 30 డిప్యూటీ కలెక్టర్లు, 25 డీఎస్పీ పోస్టుల నియామకాల్లో రూ.150కోట్ల అవినీతికి పాల్పడి, నిరుద్యోగులకు తీరని అన్యాయం చేసిందని విమర్శించారు. ఇప్పటికే ఉద్యోగాలు లేక గడచిన ఐదుళ్లుగా యువత తీవ్ర నిరాశలో ఉన్నారని, నియామకాలు చేపట్టిన పోస్టుల్లో సైతం అవినీతికి పాల్పడడం జగన్‌రెడ్డి అరాచక, అవినీతి పాలనకు అద్దం పడు తోందన్నారు. తక్షణమే జగన్‌రెడ్డి బాధ్యత వహించి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్ర మంలో టీడీపీ జిల్లా ఉపాధ్యక్షుడు పీఎంజే బాబు, నగర టీడీపీ అధ్యక్షుడు ఎం.వెంకటేష్, రాష్ట్ర బీసీ సాధికార సమితి సభ్యుడు కె.వెంకటరామరాజు, జంగమ సాధికార సమితి సభ్యుడు సూరిబాబు, డివిజన్ ఇన్‌చార్జీలు సుశీల, కొమర కమల, కొండలరావు, పెద్ద ఎత్తున కార్యకర్తలు పాల్గొన్నారు.

## కళాకే ఎచ్చెర్ల అసెంబ్లీ టికెట్ కేటాయించాలి


మాట్లాడుతున్న టీడీపీ నాయకులు

**ఎచ్చెర్ల:** ఎచ్చెర్ల అసెంబ్లీ టికెట్ టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు, మాజీ మంత్రి కిమిడి కళావెంకటరావుకే కేటాయించాలని నాలుగు మండలాల పార్టీ నేతలు కోరారు. టీడీపీ రెండో విడత జాబితాలో ఎచ్చెర్ల నియోజవర్గ టికెట్ కేటాయించకపోవడంపై ఎచ్చెర్లలోని నియోజకవర్గ పార్టీ కార్యాలయంలో గురువారం సాయంత్రం నిర్వహించిన విలేఖరుల సమావేశంలో వారు మాట్లాడారు. ఎచ్చెర్ల మండల పార్టీ అధ్యక్షుడు బెండు మల్లేశ్వరరావు మాట్లాడుతూ... కళా వెంకటరావుకు టికెట్ కేటాయింపులో జాప్యం చేయడం బాధాకరమన్నారు. లావేరు మండల పార్టీ అధ్యక్షుడు ముప్పిడి సురేష్ మాట్లాడుతూ.. ఎచ్చెర్ల టికెట్ కళావెంకటరావు కేటాయిస్తారని తెలిసినా.. కేటాయింపులో ఆలస్యం కావడం సరికాదన్నారు. రణస్థలం మండల పార్టీ అధ్యక్షుడు లంక శ్యామ్ మాట్లాడుతూ.. ఎచ్చెర్లలో పార్టీ అభివృద్ధికి ఎనలేని కృషిచేసిన కళావెంకటరావుకు జాప్యం చేయకుండా ప్రకటిస్తే మరింత ఉత్సాహంగా ప్రజల్లోకి వెళతామన్నారు. రణస్థలం మాజీ ఎంపీపీ గొర్లె విజయకుమార్ మాట్లాడుతూ.. కళాకు టికెట్ కేటాయింపులో జాప్యంతో నాయకులు, కార్యకర్తలు మనస్తాపానికి గురవుతున్నట్టు చెప్పారు. రేపటిలోగా టికెట్ కేటాయించకపోతే నియోజకవర్గంలోని నేతలంతా చంద్రబాబు వద్దకు బయలుదేరుతామన్నారు. కళాకు టికెట్ ప్రకటించకపోతే తాను స్వతంత్ర అభ్యర్థిగా పోటీలో ఉంటానని మాజీ జడ్పీటీసీ గొర్లె లక్ష్మణరావు తెలిపారు. కార్యక్రమంలో జి.సిగడాం మండల పార్టీ అధ్యక్షుడు కుమరాపు రవి, పార్టీ నాయకులు వావిలపల్లి రామకృష్ణ, అన్నెపు భువనేశ్వరరావు, పైడి అన్నంనాయుడు, సంధ్యా గజపతి చౌదరి, కంచరాన సూరన్నాయుడు, బల్లాడ అరుణ, టంకాల మౌళీశ్వరరావు తదితరులు పాల్గొన్నారు. కాగా, కళాకు సీటు కేటాయించాలని పెద్ద ఎత్తున నినాదాలు చేశారు.

## మబగాం నుంచి బగ్గు ర్యాలీ


అభిమానులతో ర్యాలీగా వస్తున్న మాజీ ఎమ్మెల్యే బగ్గు

**పోలాకి/నరసన్నపేట:** నరసన్నపేట నియోజకవర్గం నుంచి టీడీపీ తరఫున పోటీ చేసేందుకు బగ్గు రమణ మూర్తికి టికెట్ అధిష్ఠానం ప్రకటించడంతో గురువారం అభిమానులు, కార్యకర్తలు సందడిచేశారు.పోలాకి మండలంలోని మబగాంలో గల రమణమూర్తి ఇంటికి చల్లబంద, కుసుమపోలవలస, వెదుళ్లవలస, పిన్నింటిపేట, కోడూరు, దండులక్ష్మీపురం, గొల్లలవలస, దీర్ఘాశి, తోటాడ, ఈదులవలస, జనావానిపేట గ్రామాల అభిమానులు చేరుకున్నారు. వీరంతా ఊరేగింపుగా నరసన్నపేట వరకూ ర్యాలీ నిర్వహించారు.

## సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి

**శ్రీకాకుళం క్రైం:** సైబర్ నేరాలపై ప్రజలంతా అప్రమత్తంగా ఉండాలని ఎస్పీ జీఆర్ రాధిక గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఆన్‌లైన్ ట్రేడింగ్ పేరుతో ప్రజలను సైబర్ నేరగాళ్లు మోసం చేస్తున్నారని, ప్రజలంతా జాగ్రత్తగా ఉండాలని సూచించారు. సైబర్ నేరగాళ్లు ఫేస్‌బుక్, ఇన్‌స్టాగ్రామ్ వంటి సామాజిక మాధ్యమ్యాల యూజర్లను లక్ష్యంగా చేసుకుని, స్టాక్ మార్కెట్లో పెట్టుబడులు పెడితే లాభాలు వస్తాయని నమ్మించి తప్పుడు ప్రకటలతో ఆకర్షించి మోసం చేస్తున్నారన్నారు. స్టాక్ మార్కెట్‌లో తెలియని, గుర్తుతెలియని వాట్సప్ గ్రూప్‌ల్లో వచ్చే లింకులను క్లిక్ చేయకూడదన్నారు. సైబర్ మోసానికి గురైతే 1930 సైబర్ హెల్ప్‌లైన్‌కి సమాచారం ఇవ్వాలని, అలాగే సైబర్‌క్రైమ్.జీవోవీ.ఇన్‌లో ఫిర్యాదు చేయాలన్నారు.

## సహకార సంఘాల బలోపేతానికి కృషి

**అరసవల్లి:** సహకార సంఘాలను మరింత అభివృద్ధి చేసి, వాటి బలోపేతానికి కేంద్ర ప్రభుత్వం కృషి చేస్తున్నట్టు ఎన్‌సీసీటీ స్టేట్ కో-ఆర్డినేటర్ ఎస్ఎల్ఎన్‌టీ శ్రీనివాస్ అన్నారు. గురువారం స్థానిక డీసీసీబీ ఆవరణలో ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల అవగాహన సదస్సులో ఆయన పాల్గొని మాట్లాడారు. వివిధ రంగాల నిపుణులతో కమిటీలు ఏర్పాటు చేసి, సహకార వ్యవస్థలో ఉన్న బలహీనతలను, లోపాలను గుర్తించి, వాటిని సరిదిద్ది, సంస్థల ఆదాయ వనరులను పెంచుతూ ఆర్థిక స్వావలంబన దిశగా బలోపేతం చేస్తామన్నారు. మూసివేసిన చక్కెర కర్మాగారాలను తెరిపించేందుకు కృషి చేస్తామన్నారు.

## అసిరితల్లి ఆలయ వార్షికోత్సవం

**పోలాకి:** గొల్లలవలస గ్రామ అసిరితల్లి ఆలయ సప్తమ వార్షికోత్స వాన్ని గురువారం గ్రామస్థులు ఘనంగా నిర్వహించారు. ఉదయం మహిళలు ముర్రాటలను ఊరేగింపుగా ఆలయానికి తీసుకువెళ్లారు. అమ్మవారికి ముర్రాటలుపోసి కుటుంబ సభ్యులతో మొక్కులు తీర్చుకు న్నారు. సర్పంచ్ పంచిరెడ్డి జగన్మోహన్ శాంతమ్మ, మాజీ సర్పంచ్ పి.సింహాచలం, పి.శ్రీనివాసరావు, రామారావు పాల్గొన్నారు.

## 'నిధులు మళ్లించడం తగదు'

**పొందూరు:** పాఠశాలల నిధులు ఎన్నికల పనులకు మళ్లించడం తగదని డెమొక్రాటిక్ టీచర్స్ ఫెడరేషన్ (డీటీఎఫ్) జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శి పూజారి హరిప్రశన్న, పేడాడ కృష్ణారావు గురువారం ఒక ప్రటకటనలో పేర్కొన్నారు. నూతన జాతీయ విద్యావిధానం పేరుతో సజావుగా సాగుతున్న పాఠశాలలను మూతపడేట్టు చేసి అందులో పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేసి మౌలికవసతుల కల్పన పేరుతో నాడు-నేడు నిధులు తరలించడం ఎంతవరకు సమంజసమన్నారు.

## విద్యార్థుల ప్రదర్శన


'పై' ఆకృతిలో ఉన్న విద్యార్థులు

**పొందూరు:** అంతర్జాతీయ గణిత దినోత్సవం సందర్భంగా గురువారం తాడివలస పాఠశాలలో విద్యార్థులు ప్రదర్శించిన గణిత సూచిక (ఆకృతి) ఆకట్టుకుంది. గణిత ఉపాధ్యాయులు పూజారి హరిప్రశన్న, సీహెచ్ వేణుగోపాల్ విద్యార్థులు ప్రదర్శించిన గణితంలోని 'పై' విశిష్టతను వివరించారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం బల్ల కంఠయ్య, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## విద్యార్థులకు అభినందన

**కంచిలి:** విజయవాడలో మార్చి 2వ తేదీన నిర్వహించిన 11వ ఆల్‌ఇండియా చిల్డ్రన్స్ యూత్ ఆర్ట్ కాంపిటీషన్, పెయింటింగ్ ఎగ్జిబిషన్‌లో కంచిలి అంబేడ్కర్ గురుకులం విద్యార్థులు ప్రతిభ కనబరచినట్టు పాఠశాల హెచ్ఎం బమ్మిడి అప్పారావు అన్నారు. 15 బంగారు, 15 సిల్వర్ మెడల్స్‌తో పాటు 83 మంది విద్యార్థులు వివిధ పోటీల్లో సర్టిఫికేట్లు సాధించారని తెలిపారు. వీరికి గురుకుల పాఠశాలలో గురువారం అభినందించి సర్టిఫికేట్లు అందజేశారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ డి.మన్మధరావు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## చట్టాలపై అవగాహన అవసరం


మాట్లాడుతున్న న్యాయాధికారి సన్యాసినాయుడు

**ఎచ్చెర్ల:** ప్రతి ఒక్కరికి చట్టాలపై అవగాహన అవసరమని సీనియర్ సివిల్ న్యాయాధికారి, శ్రీకాకుళం న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి ఆర్.సన్యాసినాయుడు అన్నారు. ధర్మవరంలో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ యూనివర్సిటీ ఎన్ఎస్ఎస్ యూనిట్-2 ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ప్రత్యేక శిబిరంలో గురువారం న్యాయ విజ్ఞాన సదస్సు జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. హక్కులను కాపాడుకుంటూ బాధ్యతలను విస్మరించరాదన్నారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ పీవో డి.తాతారావు తదితరులు పాల్గొన్నారు. మత్తు పానీయాలు తీసుకోవడం వల్ల కలిగే నష్టాలపై అవగాహన కల్పిస్తూ ర్యాలీ నిర్వహించారు.

## బెంతొరియాల వినూత్న నిరసన


ఉరితాడుతో నిరసన తెలుపుతున్న దృశ్యం

**కంచిలి:** బెంతొరియా కులస్థుల ఆరాధ్య దేవత జామియల్లమ్మ (బొడ్డిదేవత) ఉత్సవాల్లో భాగంగా ఏర్పాటు చేసిన సాంస్కృతిక కార్యక్రమాల వేదిక వద్ద ఆ కులానికి చెందిన స్టీల్ ప్లాంట్ ఉద్యోగి, పరమానంద బిసాయి (బీటెక్ ఇంజినీరింగ్) మెడకు ఉరిపోసుకుని నిరసన తెలిపారు. ఈ సందర్భంగా బెంతొరియా యువకులు మాట్లాడుతూ.. గడచిన 30 ఏళ్లుగా తాము ఏ కులం ఏలకుండా జీవిస్తున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. ఇచ్ఛాపురం నియోజకవర్గంలోనే సుమారు 25 వేలు జనాభా కలిగి ఉన్న తమకు గతంలో ఎస్టీ సర్టిఫికేట్లు మంజూరు చేశారన్నారు. ఇప్పుడు కుల ధ్రువ పత్రాలు జారీ చేయకపోవడంతో అన్ని విధాలుగా ఇబ్బందిపడుతున్నామన్నారు.

## ఈవీఎంలపై అవగాహన

**ఇచ్ఛాపురం:** ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యంలో ఈవీఎంలపై ప్రతీ ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని ఎన్నికల రిటర్నింగ్ అధికారి బి.సుదర్శన్ దొర అన్నారు. గురువారం పాఠశాలలో సెక్టార్, రూట్ అధికారులతో సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో 33మంది సెక్టార్, 33మంది రూట్ అధికారులు పాల్గొన్నారు.

## నియోజకవర్గ అభివృద్ధికి కృషి


కళాక్షేత్రాన్ని ప్రారంభిస్తున్న గొండు శంకర్

**అరసవల్లి:** శ్రీకాకుళం నియోజకవర్గ అభివృద్ధికి నిరంతరం, స్వచ్ఛందంగా శ్రమిస్తానని టీడీపీ నాయకుడు, సర్పంచ్‌ల సంఘం జిల్లా అధ్యక్షుడు గొండు శంకర్ అన్నారు. నగరంలోని ఆర్ట్స్ కళాశాలలో కళాక్షేత్రాన్ని తన స్వంత నిధులతో నిర్మించి గురువారం ప్రారంభించి మాట్లాడారు. కార్యక్రమంలో అంబటి లక్ష్మీరాజ్యం, పాండ్రంకి శంకర్, ఇప్పిలి తిరుమల, రెడ్డి శంకర్, మూకల్ల శ్రీను, బొల్లా నాగేంద్రయాదవ్ కార్యకర్తలు పాల్గొన్నారు.

## 27న మదినా బాబా చందనోత్సవం

**గార:** కళింగపట్నంలో ప్రసిద్ధ మదీనాబాబా చందన ఉత్సవాన్ని ఈ నెల 27వ తేదీ బుధవారం వైభవంగా నిర్వహించనున్నట్టు ఉత్సవ కమిటీ గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఏటా రంజాన్ మాసంలో చంద్రుడు కనిపించిన 16వ రోజున ఇక్కడ చందన ఉత్సవాన్ని (ఉర్సు) నిర్వహించడం ఆనవాయితీగా వస్తోంది. ఈ ఏడాది కూడా ఈ ఉర్సు ఉత్సవాన్ని ఘనంగా నిర్వహించనున్నారు.

## 1001 పెన్నులకు పూజ



**శ్రీకాకుళం కల్చరల్:** పాలకొండ రోడ్డులో ఉన్న విజయగణపతి ఆలయంలో టెన్త్ పరీక్షలు సందర్భంగా విద్యార్థులకు ఆశీర్వాదం కల్పిస్తూ 1001 పెన్నలకు అర్చకులు శ్రీధర్ శర్మ, సూర్యనగేష్ శర్మ ఆధ్వర్యంలో పూజలు నిర్వహించారు. ఆలయ కమిటీ అధ్యక్షుడు వీనస్ హరి గోపాల్ తదితరులు పర్యవేక్షించారు.

# జనసేన పార్టీ ఆవిర్భావ దినోత్సవం


ఇచ్ఛాపురం: ఆవిర్భావ దినోత్సంలో పాల్గొన్న రాజు

**టెక్కలి:** రానున్న ఎన్నికల్లో టెక్కలి నియోజకవర్గంలో జనసేన, బీజేపీ బలపరిచిన అభ్యర్థి కింజరాపు అచ్చెన్నాయుడును గెలిపించాలని జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి కణితి కిరణ్‌కుమార్ పిలుపునిచ్చారు. గురువారం టెక్కలిలోని జనసేన కార్యాలయంలో ఆ పార్టీ 11వ ఆవిర్భావ దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి కణితి కిరణ్‌కుమార్ ఆధ్వర్యంలో పార్టీ జెండాను ఎగురవేశారు. నాయకులు చిరంజీవి, శకుంతల, గవరయ్య కుమారస్వామి, వెంకటరమణ, భాస్కర్, త్రివేణి, షణ్ముఖ్, సోమేసు, పోతయ్య నరేంద్ర, ప్రదీప్, కౌశిక్ పాల్గొన్నారు.


పలాస: జెండా ఆవిష్కరణలో జనసైనికులు

- **పలాస:** రానున్న ఎన్నికల్లో జనసేన- తెలుగుదేశం అభ్యర్థులు గెలుపొందడమే ధ్యేయంగా పనిచేస్తామని జనసేన నాయకులు తెలిపారు. పలాస జనసేన కార్యాల యంలో ఆ పార్టీ ఆవిర్భావ దినోత్స వాన్నినిర్వహించారు. కార్యక్రమంలో కోన కృష్ణారావు, పుక్కల శ్రీదేవి, ఉమామహేష్, ఎన్.ధర్మా రావు, గిరీష్, సాయి, శ్రీకాంత్ పాల్గొన్నారు.
- **ఇచ్ఛాపురం:** జనసేన పార్టీ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు నియోజకవర్గ ఇన్‌చార్జి దాసరి రాజు ఆధ్వర్యంలో గురువారం ఘనంగా నిర్వహించారు. స్థానిక కార్యాలయంలో పార్టీను ఆవిష్కరించారు. రానున్న ఎన్నికల్లో కూటమి అభ్యర్థిని గెలిపించుకోవాలన్నారు. కార్యక్రమంలో జనసైనికులు దాసరి శేఖర్, ఆర్.భాస్కరరావు, కామేష్ కర్రి నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా మీన సంక్రమణం

**ఇచ్ఛాపురం:** గ్రామదేవత స్వేచ్ఛావతి అమ్మవారి ఆలయంలో పల్లంటి చిరంజీవి దంపతులు మీన సక్రమణం పూజలు ఘనంగా జరిపారు. గురువారం వేకువ జాము నుండే ప్రత్యేక పూజా కార్యక్రమాలు జరిపారు. పంచామృతాలు, పళ్ల రసాలతో అమ్మవారికి అభిషేకించి పూజలు జరిపారు. మధ్యాహ్నం ఆలయ ప్రాంగణలో ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమంలో రెండు వేల మంది భక్తులు పాల్గొన్నారు. గాంధీ పార్క్ ఎదురుగా ఉన్న ముత్యాలమ్మ గుడిలో, మండపల్లి గారపోలమ్మ గుడిలో సంక్రమాణం పూజలు జరిపారు. అన్ని ఆలయాల్లో అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు.

## అభివృద్ధి పనులకు శంకుస్థాపన

**శ్రీకాకుళం అర్బన్:** నగరంలోని పలు డివిజన్లలో అభివృద్ధి పనులకు మంత్రి ధర్మాన ప్రసాదరావు శంకుస్థాపనలు చేశారు. గూనపాలెంలో రాజీవ్ గాంధీ పార్క్ నిర్మాణ పనులకు రూ.16.50 లక్షలతో, దండివీదిలో రూ.10లక్షలతో సీసీ రోడ్డు, డ్రైనేజీ నిర్మాణ పనులు, బాదుర్లపేటలో రూ.21.80 లక్షలతో, రెడ్డి కిల్లిపాలెంలో రూ.21.25 లక్షలతో సీసీ రోడ్డు, డ్రైనేజీ, కల్వర్టు నిర్మాణ పనులకు మంత్రి శంకుస్థాపనలు చేశారు. రావాడ జోగినాయుడు, తంగి శ్రీపతి, శేషగిరి పాల్గొన్నారు.

## మినీ జాబ్‌మేళా రేపు

**ఎచ్చెర్ల:** ఏపీఎస్ఎస్‌డీసీ ఆధ్వర్యంలో శ్రీకాకుళం నగరం ఆర్టీసీ కాంప్లెక్స్ సమీపంలోని నెహ్రూ యువ కేంద్రంలో మినీ జాబ్‌మేళాను ఈ నెల 16న నిర్వహించనున్నట్టు జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి పీబీ సాయి శ్రీనివాస్ తెలిపారు. ముత్తూట్ ఫైనాన్స్, అపోలో ఫార్మసీస్ లిమిటెడ్‌లో ఉద్యోగాల కోసం ఇంటర్వ్యూలు నిర్వహిస్తామన్నారు. 18-35 ఏళ్ల లోపు వయస్సు గల అభ్యర్థులు అర్హులన్నారు. ముత్తుట్ ఫైనాన్స్‌లో ఇంటర్న్స్ /పీవోల పోస్టుల కోసం ఏదైనా డిగ్రీ, ఎంబీఏ, ఎంసీఏ చదివిన అభ్యర్థులు అర్హులని, వీరికి జీతం రూ.17 వేల నుంచి రూ.21 వేల వరకు ఉంటుందన్నారు. అపోలో ఫార్మసీస్ లిమిటెడ్‌లో ఆర్టీఏ ఉద్యోగాలకు పురుష అభ్యర్థులు అర్హులని, పదో తరగతి నుంచి ఏదైనా డిగ్రీ చదివి ఉండాలన్నారు. వీరికి నెలకు రూ.10,500 జీతం చెల్లిస్తారన్నారు. అపోలో ఫార్మసీలో ఫార్మసిస్ట్ ఉద్యోగాలకు మహిళా అభ్యర్థినులు అర్హులని, వీరికి రూ.14 వేల నుంచి రూ.20 వేల వరకు జీతం ఉంటుందన్నారు. ఆసక్తి అర్హత అభ్యర్థులు ఈ నెల 16న ఉదయం 9 గంటలకు హాజరుకావాలన్నారు. మరిన్ని వివరాల కోసం 97049 60160, 63010 54132 ఫోన్ నెంబర్లలో సంప్రదించాలన్నారు.

## ఓటు వజ్రాయుధం

**ఇచ్ఛాపురం:** ఓటు వజ్రాయుధం లాటిందని, ఓట హక్కుపై అందరూ అవగాహన కలిగి ఉండాలని ఏపీఎం సనపల ప్రసాద్ అన్నారు. గురువారం మండల సమైక్య కార్యాలయంలో ఈఎస్ఎఫ్ సభ్యులతో సమావేశం నిర్వహించారు. మెంబర్స్ వారీగా ఫిజికల్ వెరిఫికేషన్ తోపాటు సంఘనిధి పెంచుకోవటానికి అంతర్గత అప్పు వాడుకోవడం తిరిగి చెల్లింపులుపై అవగాహన కల్పించారు.

## క్రీడాకారుల ఎంపిక

**ఎచ్చెర్ల:** సెపక్ తక్రా ఆల్ ఇండియా అంతర్ వర్సిటీ క్రీడా పోటీల్లో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ యూనివర్సిటీ తరపున పాల్గొనే క్రీడాకారుల (పురుషులు) ఎంపిక గురువారం వర్సిటీలో గురువారం జరిగింది. ఈ నెల 17 నుంచి 20వ తేదీ వరకు రాయలసీమ యూనివర్సిటీ (కర్నూలు)లో జరిగే ఈ పోటీల్లో ఎంపికైన క్రీడాకారులు బీఆర్ఏయూ తరపున పాల్గొంటారు. జట్టుకు కోచ్‌గా జి.అర్జునరెడ్డి వ్యవహరిస్తారు. ఈ పోటీలకు ఎంపికైన క్రీడాకారులను వర్సిటీ స్పోర్ట్స్ డీన్ డాక్టర్ యు.కావ్యజ్యోత్స్న, పీడీలు భాస్కర్, శ్రీనివాసరావులు అభినందించారు.

## చలో ఢిల్లీ విజయవంతం చేయాలి

**ఎచ్చెర్ల:** కేంద్ర ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేయాలని డిమాండ్ చేస్తూ రైతులు చేపడుతున్న చలో ఢిల్లీ కార్యక్రమానికి మద్దతుగా సీఐటీయూ ఆధ్వర్యంలో గురువారం ఎచ్చెర్లలో నిరసన ప్రదర్శన జరిగింది. సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి పి.తేజేశ్వరరావు మాట్లాడుతూ శాంతియుతంగా నిర్వహిస్తున్న కార్యక్రమాన్ని హర్యానా సరిహద్దులో అడ్డగించడం అన్యాయమన్నారు. కార్యక్రమంలో సీఐటీయూ నేతలు ఆర్.ప్రకాశరావు, డి.బంగార్రాజు, రామారావు, శ్రీనివాసరావు పాల్గొన్నారు.

## డైనింగ్ హాల్ ప్రారంభం

**ఇచ్ఛాపురం:** పురపాలక సంఘ పరిధి పంజావీధి పాఠశాలలో నూతనంగా నిర్మించిన మధ్యాహ్న భోజన పథకం డైనింగ్ హాల్‌ను ఎంఈవో కె.అప్పారావు ప్రారంభించారు. గురువారం పాఠశాలను సందర్శించారు. ఈ సందర్భంగా విద్యార్థుల చదువుపై ఆరా తీసి వెనుక బడిన విద్యార్థులపై ప్రత్యేక దృష్టి సారించాలని ఉపాధ్యాయులకు సూచించారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం దనలక్ష్మి, కె శ్రీనువాసరావు,సురేష్ పాల్గొన్నారు.

## పరీక్ష సామగ్రి పంపిణీ

**కంచిలి:** మఖరాంపురం జిల్లా పరిషత్ ఉన్నతపాఠశాలలో పదో తరగతి విద్యార్థులకు స్థానిక గ్రామపెద్దలు వజ్జ మృత్యుంజయరావు, ప్రవీణ్‌సాగర్ గురువారం పరీక్ష సామగ్రి పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు వి.బాబూరావు, రమణ, సోమేశ్వరరావు, సూర్యనారాయణ, పీడీ పండా, మీనాక్షి, మంజు పాల్గొన్నారు.

## ఘనంగా జామి యల్లమ్మ జాతర

**కంచిలి:** ఆముదాలపుట్టుగలో జామియల్లమ్మ ఉత్సవాలను గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పరిసర గ్రామాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని మొక్కులు తీర్చుకున్నారు. ఆలయం వద్ద సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం అన్నసమారాధన నిర్వహించారు.

## వైసీపీలో గ్రూపుల గోల

**ఆమదాలవలస:** ఆమదాలవలస నియోజకవర్గం వైసీపీలో నెలకొన్న గ్రూపుల గోల కొలిక్కి రానట్టుంది. గురువారం పట్టణంలోని ఓ కల్యాణ మండపంలో నిర్వహించిన నియోజకవర్గస్థాయి వైసీపీ సమన్వయ కమిటీ సమావేశంలో మరోసారి బయటపడింది. స్థానిక సంస్థల ఎన్నికల నుంచి స్పీకర్ తమ్మినేని సీతారాం, సీనియర్ వైసీపీ నాయకులు సువ్వారి గాంధీ మధ్య నెలకొన్న మనస్పర్థలు పార్టీ జిల్లా, రాష్ట్ర స్థాయి నాయకులు ఎన్నిమార్లు సర్దిచెప్పినా నేటికీ కొలిక్కిరాలేదు. నియోజకవర్గంలో వైసీపీ నిర్వహించిన సాధారణ సమావేశాలతో పాటు రాష్ట్ర స్థాయి వైసీపీ నాయకులు పాల్గొన్న సమావేశాలకు కూడా సువ్వారి హాజరుకాకపోవడంతో ఆ పార్టీ నాయకులు, కార్యకర్తలకు ఆశ్చర్యానికి గురిచేసింది. సమావేశానికి ఉత్తరాంధ్ర వైసీపీ రీజనల్ కో-ఆర్డినేటర్ వైవీ సుబ్బారెడ్డి, డిప్యూటీ కో-ఆర్డినేటర్ మజ్జి శ్రీనివాసరావు, పార్టీ జిల్లా అధ్యక్షుడు ధర్మాన కృష్ణదాస్, స్పీకర్ తమ్మినేని సీతారాం హాజరైనా సువ్వారి గాంధీతోపాటు కోట గోవిందరావు కూడా హాజరుకాలేదు.

## 2,529 మందికి లక్షల లబ్ధి

**కలెక్టరేట్:** జిల్లాలో ఆర్థికంగా వెనుకబడిన తరగతుల కులాలకు చెందిన 2,529 మంది మహిళలకు ఈబీసీ నేస్తం ద్వారా రూ.379.35 లక్షలు లబ్ధి పొందినట్టు కలెక్టర్ మన్‌జీర్ జిలానీ సమూన్ తెలిపారు. ముఖ్యమంత్రి బటన్ నొక్కి ప్రారంభించిన ఈ కార్యక్రమంలో కలెక్టర్ తన కార్యాలయంలో లబ్ధిదారులకు నమూనా చెక్కును అందజేశారు.